ప్రబుద్ధాంధ్ర

కలాభివర్ధనీపరిషత్తుపక్షమున ప్రకటింపబడు మాసపత్రిక

సంపాదకుడు:—శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

సంపుటము ౫ } రాజమహేంద్రవరము మెయి ౧౯౩౪ { సంచిక ౫

మొదటి దాడి

సుబ్రహ్మణ్యశాస్త్రి—సంపాదకుడు

"నువ్వింత పిరికిపంద వైపోతా వనుకో లేదు నే నెప్పుడూను"

"..................."

"సిగ్గు లేదూ?"

"అ దెలా వుంటుందో యెరుగుదువా నువ్వు?"

"మాటలు నేర్చావు"

"..................."

"స్కూలు ఫైనల్లో తప్పిపోయినప్పుడు చదువు మానేస్తే నా కీయేడుపు లేకపోవును. బి. ఏ. అని పించుకుని కూడా యింత అమ్మమ్మ వైపోయినందుకు నేను విచారిస్తున్నాను"

"క్షమించు"

"ఆమాట తీసెయ్యి నాదగ్గిర......నిన్నేం చేసినా నాకసి తీరదు"

"..................."

"జోన్ ఆఫ్ ఆర్కు లాగా, మిస్ నైటింగేలు లాగా జీవితం సఫలపరుచుకోవా లని ఉవ్విళ్లూరే దానవు. "మళ్లీ పెళ్లో అంటూ యేడుస్తా" వని నన్ను కోసుకు తినేసేదానవు. ఇప్పు డీ వాలకం సేమిటీ?"

"..................."

"పెళ్లి మీదికి పోతోందా యేమిటి చూపు?"

"ఈవయస్సులో ఆకోరిక పుట్టడం తప్పా?"

"ఛీ! బుద్ధి లేని పీనుగా!......మళ్లీ మొగాడి చేతికి జుట్టందిస్తావుటే?"

"మొగాళ్లు నాకు చేసిన అపకారం యేమిటీ?"

"వైధవ్యముండని చెయ్య లేదూ?"

"తరవాత ఆచేత్తోటే బి. ఏ. దాకా చదువు చెప్పించ లేదూ?"

"వైధవ్యరికం తప్పిందా?"

"పెళ్లి కాని మా మూడో చెల్లికీ నాకూ భేదం యేమిటీ?"

"దాని కుండే గౌరవం నీ కెందుకు వస్తుందీ?"

"..................."

"కోరచూపులు చూస్తే నా కేం భయ మనుకున్నావా?"

"బి. ఏ. అయినవాళ్ల కందరికీ ఆత్మగౌరవం అంటే యేమిటో తెలుస్తుం దనీ, తప్పకుండా వుంటుం దనీ అనుకుంటున్నాను నేను. నా వూహ తప్పే"

"పెద్దపెద్ద మాటలు విడిచిపెడుతున్నావు"

"ఆవిషయంలో నీతో నాకు పేచీ లేదు"

“అబ్బో.............”

“.................”

“చివరి కేమంటావు? మాత నిన్నూ నన్నూ పిలుస్తోంది”

“వినపడుతోంది—కొంచెం—కొంచెం”

“కొంచెం కొంచెమా?”

“అవును. అంతే”

“హృదయం అంటూ వుంటే ఆ కొంచెమే చాలు”

“.................”

“మరి రావేం?”

“.................”

“మాట్లాడవేమే?”

“.................”

“నిన్నే మనాలో నాకు తోచడం లేదు”

“వూరుకోరాదూ?”

“నిన్ను విడిచిపెడతాననుకున్నావు కామోసు పాపం”

“.................”

“జెయిలంటే భయమా?”

“జెయిలుకి వెళ్లడమే ప్రధానమా?”

“అది దేశాభిమానానికి యేకమాత్రమైన గుర్తు”

“రాజకీయంలో దిగితే అంతే కావచ్చు”

“ఇప్పుడు రాజకీయం తప్ప మరో సమస్యే లేదు మనకి”

“నేనలా అనుకోడం లేదు”

“నువ్వెంతటిదానవు? నీ లెక్కేమిటి? నీ అభిప్రాయానికి విలువ కూడానా?”

“.................”

“మహా మహా వాళ్లంతా యీ ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్నారు. నీ తాహతెంత నీ హాయామెంత?”

“నీ ధోరణే నీదీ, అలాగే నా రుచే నాదీ అనుకోరాదూ?”

“నీకు రుచంటూ కూడా వొకటేడిసిందా?”

“.................”

“ఇక నేను నింపాదిగా మాట్లాడలేను. వస్తావా రావా? అగ్నిహోత్రంలో వురుకుతావా, వురకవా?”

“నే నురికే అగ్నిహోత్రం వేరు”

“పొయిదగ్గిర పడి యేడవడమూ, పశువులాగ పిల్లల్ని—”

“నోరు సమాళించుకో. నువ్వెవరితో మాట్లాడుతున్నావో తెలిసే—”

“ఇప్పటికి వస్తోంది కామోసు పౌరుషం”

“వొక మూల మొగాళ్లని తిడుతూ మళ్లీ పౌరుషమో అంటూ యేడుస్తావేం?”

“.................”

“.................”

“నీతో మాట్లాడడం తప్పే నాది”

“తరవాతి మాట కూడా అనేసెయ్యి”

“అసలు నీ మొగం చూడ్డమే మొదటి తప్పు”

పళ్లు కొరుకుతూ యిలా అని సుభద్ర తారాజువ్వలాగ లేచింది. చీడీలు దిగేటప్పుడు రంగూన్ స్లిప్పర్లు జెనికిపోగా తూలి ముందుకి పడ్డంత అవస్థ అయింది; కాని ఆమె చాలా ప్రయత్నంమీద ఆపుకొని కోపానికి వుడుకుమోత్తనం జోడించగా తోకతొక్కిన ఆడతాచులాగ రోజుకుంటూ చక్కాపోయింది.

జానకమ్మ, సాయంత్రం ఆరు గంటల వేళ డాబామీద పచారు చేస్తూ, అప్పుడే తల అంటుకొని వుండడంవల్ల యింకా తడిగానే వున్న జుట్టు ఆరదీసుకుంటూ “ఏమిటీ చెయ్యడం?” అని ఆలోచించుకుంటూ వుండగా సుభద్ర వచ్చి, యిలాగ తర్జనభర్జన చేసి, మనస్సు కలిచేసి వెళ్లిపోయింది.

కానైతే జానకమ్మ చాలా గంభీరురాలే; అయినా పక్కా పావు గంట దాకా ఆమె మనస్సు స్థిమితపడ లేదు. ఈలోపుగా చీకటి

పడింది. దీపం లేదు. పైగా తల్లి రెండు మూడు మాట్లు పిలిచింది; కాని ఆమె యివ్వేమీ గమనించ లేదు. “ఏమిటి చెయ్యడం?” ఇది వొక్కటే ఆమెకి ఆలోచన.

ఇప్పుడు రాజకీయంలో పని చేసే వారికి గల పలుకుబడి ఆమెకి తెలుసు. పైగా పినతండ్రి కూతురైన సుభద్ర మూడు మాసాల శిక్ష కూడా అనుభవించి రావడంవల్ల స్వర్గంలోనుంచి దిగివచ్చిన దేవకన్యలాగ ఎక్కడికి వెళ్లినా చాలా గౌరవం పొందుతోంది. చివరికి వాలంటీర్లు కూడా మహారథులుగానే చెలామణీ అయిపోతున్నారు. రాజకీయంలోకి దిగితే తనకికూడా అలాగే అసాధారణాలైన ఆదరగౌరవాలు లభిస్తాయి; కాని యీస్థితిలో కేవల రాజకీయ ప్రచారంవల్ల జాతికీ దేశానికీ మోక్షం కలుగుతుం దని ఆమెకి నమ్మకం లేదు. ఎన్నో వర్ణాలు, వొక్కొక్క వర్ణంలో యెన్నో శాఖలు, మళ్లీ అవొక్కొక్క శాఖలో యెన్నెన్నో తెగలు—వాటిలో కాలం యీడ్చుకొని పోయినట్లా పోయే వాళ్లు కొందరు, సనాతన ధర్మవాదులు కొందరు, సంస్కార పరాయణులు కొందరు, వారిలో బ్రహ్మసామాజికులు, ఆర్యసామాజికులు—హైందవుని నెత్తిమీద ఎన్ని వెంట్రుకలో హైందవులలో అన్ని భేదాలు, అన్ని స్వార్థదృష్టులు—ఇలాంటి స్థితిలో సంఘపునర్నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసి రాజకీయంలో తాండవం చెయ్యడంలో ఆమెకి సబబేమీ కనపడలేదు. ఆమెకి మొదణ్ణుంచీ సంఘసంస్కారం అంటే అభిమానం. ఆంగ్లవాఙ్మయపరిచయమూ, కాలేజీలో పాశ్చాత్య స్త్రీలతోటీ, కన్యలతోటీ కలిగిన సాహచర్యమూ ఆమెకీ రుచిని హెచ్చుచేశాయి. పైగా తొమ్మిదో యేట వితంతు వయిపోయి నిర్భాగ్యురాలుగా తలంపబడుతూ వుండడం కూడా ఆమె కీ దృష్టిని బలపరిచింది.

ఈదృష్టే ఆమెని వుద్యోగం కోసం కూడా ఆశ పడనివ్వలేదు. “మళ్లీ పెళ్లి చేసుకోడమో మానడమో యేమేనా నిశ్చయించుకున్నావా?” అని తల్లి యేడెనిమిదిమాట్లడిగింది; కాని యీ దృష్టి వల్లనే జానకి “అప్పుడే తొందరేం!” అంటూ కాలం గడుపుకొని వస్తోంది.

అయితే సంఘసంస్కారంలో యెందుకు ప్రవేశించకూడదూ అంటే యేమిటి చెయ్యడం? “సంఘం అంతా వొక్కమోస్తరుగానే యెగుడుదిగుడుగా వుంది. ఎక్కడా హెచ్చుతగ్గులు లేవు. వొక దారీ తెన్నూ లేదు. ఇందులో యెక్కడ దిద్దుబాటు మొదలు పెడితే యెక్కువ పని జరుగుతుంది?” ఇదీ ఆమెకి ప్రశ్న. వొక్క సంవత్సరం నుంచీ—అంటే బి. ఏ. అయినప్పణ్ణుంచీ ఆలోచిస్తూనే వుంది; కాని ఆమె కేమీ పాలిపోలేదు. ఆమె గంటలకొద్దీ యోచిస్తుంది. ఎన్నో ప్రణాళికలు పన్నుతుంది. ఎంతో వోపికతో కష్టసుఖాలు బేరీజు వేస్తుంది. మేలులో కీడెంచుతుంది. కీడులో మేలెంచుతుంది; కాని చివరికి “యిదీ పని. ఇదీ దారి” అని తేలదు. చేసిన యోచనా, పన్నిన కల్పనా—అన్నీ చిందర వందర అయిపోతాయి.

రోజూ రోజూ ఆమె కిదే అనుభవం.

దీనిమీద ఆమె యిలా నిశ్చయం చేసుకుంది.

“నాకు ఈశ్వరప్రేరణ అయింది; కాని యింకా తపస్సు చాలదు. నిశ్చయజ్ఞానం కలగడానికింకా మననం చెయ్యాలి. ఈశ్వరప్రేరణ స్పష్టంగా అయిం దంటే యీ సంకల్పవికల్పా లుండవు. ఈసాధ్యాసాధ్య విచారమూ, యీకర్తవ్యాకర్తవ్యసందేహాలూ వుండవు. ఆస్థితి వచ్చిం దంటే ముందుకి వురకడం తప్ప మరేమీ వుండదు. వాళ్లని వాళ్లని చూసి “అయ్యో! ముందుకి వెళ్లిపోతున్నారే” అని కంగారుపడితే లాభం లేదు”

ఇప్పుడు కూడా ఆమె సరిగా “యేమిటి చెయ్యడం?” అని మననం చేసుకుంటూ వుండగా “జానీ!” అంటూ వొక యువకుడు పైకి వచ్చాడు. చేతిలో హరికేన్‌లాంతరుంది. మొగమ్మీద ఆత్రం తొణికిసలాడిపోతోంది.

"ఎందుకురా బావా?"

"ఇప్పుడు నీవంతు వచ్చింది. వున్న పళంగా నువ్వు లేచి రావాలి"

"ఇదిగో సిద్ధం"

"దబ్బన్న మామగారి సుందరికి పెళ్లి"

"ఎవరూ చెప్పుకోలేదే?"

"అంతా రహస్యం——"

"పెళ్లికొడుకెవరు?"

"వేంకట సోమయాజులు తాత"

"ఏమిటీ?"

"దబ్బన్నమామ యాజులు తాతకి రెండువేలివ్వాలి. తాత అనోటిచ్చేశాడని పుఖారు"

"సుందరిని అమ్మేడన్నమాట"

"అక్షరాలానూ, కాని లచ్చుమ్మత్తకిది సుతరామూ యిష్టం లేదు. కూతుళ్ళు కూడా వొప్పుకోలేదు. సుందరి కంటికీ మంటికీ యేకధారగా యేడుస్తోందిట. కాని కొడుకులు చిన్నవాళ్లు కావడంచేత నిలవతీసి అడిగేవాళ్ళు లేక దబ్బన్నమామ బండకెత్తాడు."

"పెళ్ళి యెక్కడా?"

"మనవూళ్ళోనే——గుళ్ళో——అదిగో బాజాలు వినపడ్డం లేదూ?"

"................"

"అరగంటలో మూడు ముళ్ళూ పడిపోతాయి"

"అయితే పద. మూడు ముళ్ళూ పడిపోతాయేం? అబ్బా! ఏం లోకువగా వుందీ ఆడాళ్ళ బతుకూ? ఈరోజుల్లో కూడా యింకా నరమాంసవిక్రయమేనా? అందులోనూ షష్టిపూర్తి అయినవాడికా?........?"

"నువ్విక్కడ ఆవేశం పొంది కూచుంటే——"

"ఇదిగో మేడ దిగేశాను"

ముందు జానకీ, లాంతరక్కడ వుంచేసి తరవాత యువకుడూ మేఘాలమీద యెగిరిపోయారు.

"దబ్బన్నా! నువ్వు "బహూవృత్తమ" మైన ఘనవంటి కర్మ చేశావు. మన అగ్రహారంలో యాజులికి వున్నంత కర్మశ్రద్ధ యింకెవ్వరికీ లేదు. నువ్వు అతగాడికి సంభవించిన అయొక్క యిది. వుందే లోటు? అది తీర్చేశావు. "దశ పూర్వేషాం, దశాపరేషాం" అన్న సంకల్పం నీవిషయంలో అర్థవత్తు అయింది"

"ఇంకా సందేహమా? వయస్సు తక్కువయినా దబ్బన్న చాలా దీర్ఘాలోచన చేశాడు. "కర్తా కారయితా" కదూ? యాజులు అగ్నిహోత్రాలు నిలిపిన దబ్బన్నకి అశ్వమేధయాగఫలం లభించడానికి యత్నించి, త్తయినా అభ్యంతరం వుందిపోయి చయనులూ?"

"నింపాదిగా పృచ్ఛ చేస్తున్నావా నువ్వు? అసలు వాడి తాత సర్వతోముఖం చేసినవాడు కాడుపోయ్? ఆఫలం యావద్విష్టయూ వంశం పొడుగునా కనబడక యేమయిపోతుం దనుకున్నావోయ్?"

"పైగా యాజులు లక్షారం సమీపిస్తూ వున్నవాడు; గాని "లాకాయి లూకాయిగాడు" కాడు. ఇహమూ, పరమూ గూడా——ఏ మంఛావు రామశాస్త్రీ?"

"తమరు సెల విచ్చింది అక్షరాలా——విన్నారూ? వేదమూర్తులు అన్యథా సెలవిస్తారా మహానుభావా!"

"పైగా పిల్లా పీచూ——ఆ వొక్క వితంతుపుత్రికా నున్న సంసారం అంతా చక్కబెడుతూ వుంటే నూత్నవధువుతో యాజులు——ఏం లోటయ్యా సుబ్బావధానీ?"

"చిత్తం, చిత్తం. ఆవొక్క వితంతుపుత్రికా గూడా నలభై దాటింది కనక దబ్బన్న కూతుర్ని——చిత్తగించారూ? చిలకని తయారుచేసినట్టు——మహా బాగా వుంది కాదూ అంతానూ!"

"అయ్యా! చయనులుగారూ! అవధానులుగారూ! శాస్త్రులుగారూ! సుముహూర్తం సమీపిస్తోందంటున్నారు సిద్ధాంతిగారు, సెలవయితే——"

"అడగాలా మమ్మల్నీ? ఏదీ తెర బాగా పట్టుకున్నారూ? మరి కానియ్యి దీక్షితులూ!"

జానకమ్మా, యువకుడూ వెళ్ళేటప్పటికి స్థితి యిలా వుంది. పెళ్ళికూతురు బుట్టలో కూచుని కుమి [illegible] కళ్లు తుడుచుకుంటోంది. తతిమ్మా స్త్రీలు కూడా యేమంత వుత్సాహంగా లేరు. పెద్ద లంతా పాగుడుతూ వున్నా దబ్బన్న కూడా కత్తి తేస్తే రక్తం లేకుండా కన్నంలో పట్టుబడ్డ దొంగలాగ ధైర్యం చేసి మొగ మెత్తి చూడలేకుండా వున్నాడు.

పెద్దలు సెల విచ్చడంతోటే పురోహితుడు "అందరికీ అక్షింత లివ్వరా" అని శిష్యుడికి చెప్పి మంత్రాలు ప్రారంభించాడు.

ఇదంతా చూశాటప్పటికి జానకమ్మకి రక్తం వుడుకెత్తిపోయింది. శరసంధానం చేసిన ధనుస్సులా వున్న ఆమె కనుబొమ్మలు చూసి యువకుడు కూడా చకితు డయిపోయాడు.

"నువ్విప్పుడు చేస్తూ వున్న ప నేమి టయ్యా యాజులు తాతా?"

"తరవాత మాట్లాడుకుందాం"

"ఆడాళ్లందరి లాగే నువ్వు కూడా చూస్తూ కూచోరాదుటే జానకీ?"

"అలాగ టయ్యా చయనులు తాతయ్యా? నేను కూడా తెల్లపోయి కూచుంటే మీ రంతా సుందరి మెడకి వురితాడు బిగిద్దా మనుకుంటున్నా రేం? ఈ పాటికి దిగండి గుర్రం. యాజులుతాతా! ఇది తరవాత మాట్లాడుకోవలసిన విషయం కాదు. ఇప్పుడే జవాబు చెప్పాలి నాకు"

"నా కా అవసరం లేదు.

"అయితే వున్నప్పుడే చెబుదువు గాని లే. తొందర లేదు. దబ్బన్నబాబూ! సుందరి నేం చెయ్య తలచుకున్నా వయ్యా నువ్వూ?"

ఇది విని "అమ్మయ్యా! బతికాను" అని లచ్చమ్మ తెప్పిరిల్లింది. జలసిక్త మైన గ్రీష్మలత లాగ సుందరి ఆశాభరితురాలై తల యెత్తి చూసింది. స్త్రీలంతా స్త్రీలకి అంటే యేమిటో మొదటి మాటు చూడగలిగారు. అరచచ్చి పడివున్న వాడిలాగ దబ్బన్న మాట్లాడలేక పోయాడు.

"మాట్లాడ వేమయ్యా?"

"అంతా—సిద్ధ—మయి—పోయింది. ఇప్పుడింకేం చెయ్య—డానికి అవకాశం లేదు"

"జ్ఞానం వుంటే అంతా అవకాశమే. సుందరికి పెళ్ళి చెయ్యవలసిన పూచీ నీకు హెచ్చుగానే వుంది; కాని శవానికి అంటదీసి కట్టిపెట్టడానికి అధికారం లేదు"

"......... ...."

"బాగా ఆలోచించుకో"

"................."

"నీకు తోచకపోతే బుద్ధి కలవాళ్ళని సలహా అడుగు"

"................."

"వూరుకుంటే పనికి రాదు. ఈనాటకం అంతా యీపాటికి కట్టిపెట్టాలి. ఏ మంటావ్?"

"మానడానికి వీ ల్లేదు. నువ్వు దూరంగా వుండు"

"నువ్వా నేనా దూరంగా వుండవలసింది? తొందరపడకు. ఏమమ్మా పిన్నీ! నీ కెలా చేతులు వచ్చాయమ్మా చూస్తూ చూస్తూ పిల్ల గొంతు కొయ్యడానికీ?"

"వొక్క మో సరుగా రాసి రంపాన బెడుతూ వుంటే న న్నేం చెయ్య మంటావు కూతురా?"

"అయితే నువ్వివతలికి వస్తావా రావా?"

"ఇం కే మయినా సరే; నువ్వు నా కోసరా దొరికావు గదా?"

ఇలా అంటూ కాళ్ళు కడుగు చెంబు అక్కడ విడిచిపెట్టేసి లచ్చమ్మ జానకమ్మ దగ్గిరికి వచ్చి నుంచుంది.

ఇదంతా చూసి అందరూ మాట్లాడలేకపోయారు; కాని దబ్బన్నమాత్రం అతికష్టంమీద నాలిక స్వాధీనం చేసుకొని "ఇలా వస్తావా రావా?"

అని వురిమాడు. దానికి "నేను రా" నంటూ లచ్చమ్మ ఝూంకారంగా జవాబు చెప్పి జానకమ్మకి యింకా దగ్గిరగా వెళ్లింది.

"మొండిపీనుగా! ని న్నేం చేస్తానో వోపిక పట్టు. నువ్వు రాకపోతే ఆగిపోతుం దనుకున్నావు కామోసు. నీ రవిక నా మెళ్లో వేసుకొని—"

"సెబాస్! నీవంశప్రతిష్ఠ నిలిపావురా దబ్బన్నా!

"అలాగ టయ్యా సుబ్బావధానులు మీ తాతయ్యా? నిలపడూ మరీ దబ్బన్న బాబు మీ రంతా. వెనకాల తాళం వేస్తూ వుండేనూ?......పిన్ని రవిక మెళ్లో పెట్టుకుని కన్యాదానం చేస్తా వేం బాబూ నువ్వూ!"

"వోక [illegible]"

గా వుండవలసిన పెళ్ళిపందిరి చీమ రాలితే చిటుక్కుమనేటంత నిశ్శబ్దం అయిపోయింది.

పది నిమిషా లిలా గడిచాక నడుం విరిగిన నల్లతాచులాగ లేవలేక లేవలేక లేచి దబ్బన్న గుడిసెనకాలకి పోయి కూలబడ్డాడు. తరవాత పరాభవఖిన్నుడై పెళ్ళితాత * గూడా వుత్తరద్వారంలో నుంచి బైటికి వెళ్ళి చెరువుగట్టుమీద తులసికోట దగ్గిర చదికిలబడ్డాడు.

ఆతరవాత పురుషులు కొందరు యాజులు దగ్గిరకీ, కొందరు దబ్బన్న దగ్గిరకీ వెళ్లి చుట్టూ మూగారు.

యాజులు చయనుల్ని దగ్గిర కూచో మని

"..................."

"..................."

"దబ్బన్న యే మంటాడో?'

"నడుం విరిగిపోయింది"

"లాభం లే దంటావా?"

"మొత్తానికి కష్టమే"

"వూరుకో మంటావా?"

"వోపిక పట్టడమే నా కలవా"

"అయితే నా నోటు నాకు పారెయ్య మను"

"అది నిజ మేనా?"

"అసలు పదమూడు వందలు. ఫాయిదా అయిదు వందల చిల్లర మొత్తం ౭మాగమీ రెండు సంచులు—"

"నాతో చెబితే దీ నబ్బ సమ్మంధం లేకపోదునా?

"వచ్చింది యింతయింది గదా!"

"..................."

"వొక మాటు వెళ్లిరా"

"రెండు రోజులు ఆగలేవూ?"

"ఇక వాడివల్ల కాదు. ఆ దిక్కుమాలిన పిల్లనా కక్కరలేదు కూడానూ!"

"..................."

"కానైతే నలుగురిలోనూ మాట పడిపోతుందని భయపడేనా పెళ్లానికి నచ్చచెప్పుకో లేకపోతాడా అని ఆశగానే వుంది; కాని—"

"ఈసంగతి యిప్పుడే వెల్లడి అయితే జానకి మరింత పురెక్కుతుం దేమో?"

"అయ్యో"

ఈసమయంలో కంఠం సవరించుకుంటూ సుబ్బావధాని వచ్చి పక్కని కూచున్నాడు.

"ఏ మంటాడు?"

"ఆడాళ్ల చిక్కు వొదిలించుకో గలిగితే తన అభ్యంతరం యేమీ లేదుష"

"ఏమిటీ?"

"రెండో మాట లేదు'

"వొకమాటిలా తీసుకురా గలవా?"

"తుపాకిక్కూడా అందడిక వాడు"

౫

పురుషు లిలా కిందా మీదా యి దవుతూ వుండగా అక్కడ స్త్రీ లంతా జానకిని చుట్టవేశారు. "నీమూలాన సుందరికీ గండం తప్పిందే జానకీ" అంది వెంకటసుబ్బమ్మ. "మనం యిలా యెదురుకుంటూంటే యీ మొగాళ్లేం చెయ్యగలరే?" అంది లక్ష్మీనరసమ్మ కళ్లు తిప్పుకుంటూనూ. "కాకపోయినా మన వూరు మరీ చెడిపోయిందే. మేమమ్మా మహామహా చదివేశామని అవధాన్లవారూ శాస్త్రులవారూ, సోమయాజులవారూ నానా మాలకూడూ—యాక్కారారే! డోకొస్తోందర్రా తలుచుకుంటేనూ" అంది కామశాస్త్రిగారి పార్వతమ్మ "రెండువేల రూపాయలనోటు మీద పారేశారుషే సోమయాజులుగారూ దబ్బన్న చేతులు విరిచీ! ఆయన కిప్పుడు పెళ్లేమిషర్రా విపరీపు బుద్ధి కాకపోతేనూ? మంచో చెడ్డో యేదో వుండనే వుంది కదా ఆబోగందానితోటే ఆకాస్త కాలమూ గడిపేస్తే—" అని నీలన్నగారి సీతామహాలక్ష్మి అంటూ వుండగా చాపలాంబ అడ్డు వచ్చి "యిప్పటికిదీ కాస్త నయమే. వుంచుకున్న దాని మేళం తీసుకువచ్చారు కారు తాతగారు. అందుకు సంతోషించండి" అంది. దానిమీద అందరూ పకపకా నవ్వారు. ఆనవ్వులతో గుడి ఆవరణ అంతా గుమ్మయిపోయింది.

అప్పుడు పెళ్లితాత కూతురు రామలక్ష్మి సిగ్గుపడుతూ విచారిస్తూ ముందుకు వచ్చి "యిప్పుడీ పెళ్ళేమిటి నాన్నా!" అని నే ననేకవిధాల యేడ్చాను. కష్టసుఖా లన్నీ విప్పి చెప్పాను. ఎంత చెప్పినా ససేమిరా అంటే నే నేం చెయ్యనర్రా? ఇది మానేసి పోనీ పిల్లాణ్ణి పెంచుకో మన్నాను. ముందిది అయితే గాని అదెలాగని నన్ను కొట్టినంత పని చేశాడు మా నాన్న. "అయితే మీకర్మం" అని నేను చచ్చినట్టు పడివున్నాను. ఇంత

రగడ యెందుకు పెరగాలీ కర్మం కాకపోతేనూ!'' అంది కళ్లల్లో నీళ్లు పెట్టుకుని. అప్పుడు జానకి అందుకుని యిలా వుపన్యసించింది.

"రామలక్ష్మి మాటలు విన్నారా మీ రంతానూ? కాని మొగాళ్లం మన కేమని వీళ్లకి మహా అంఉ్రడబ్బ ప్రబలిపోయింది. దీని కంతా కారణం మనమే. మనం భీష్మించుక్కూచుంటే వీ ళ్ళేం చెయ్యగలరూ? మన శక్తి మనం మరిచిపోయాం. మన అధికారం మనం వొదులుకున్నాం. మనకి మనమే చేతులారా బానిసల మైపోయాం. ఆడదాని బతుకు మొగాడి కాలికింద వుంది యిప్పుడు. ఇతరదేశాల్లో ఆడది మొగాడితో సమంగా బతుకుతోంది. మన తెలివితక్కువకి యీ వుదాహరణం చాలదూ? పైగా రామలక్ష్మి వెఱ్ఱిబాగులతనం చూడండి. తండ్రి నది యీ పెళ్ళి మానేసి పిల్లాణ్ణి పెంచుకో మందిట. కడుపున పుట్టిన తా[illegible] తీసుకురావడం యేమి? సీమలో కొడుకులు లేని తండ్రి చచ్చిపోతే ఆస్తి అంతా కూతుళ్లకి వస్తుంది. యాజులు తాత లక్షరూపాయల సంసారి. అతని తరవాత యెక్కణ్ణుంచో వచ్చినవాడు సామ్మ అనుభవించడమూ, కడుపున పుట్టిన రామలక్ష్మి వాణ్ణి ఆశ్రయించి, వాడి పెళ్ళాం యీసడింపులు పడుతూ శవంలాగ బతకడమూనా?......మనలో యిలాంటివి చాలా వున్నాయి. అవన్నీ మీకు రోజూ బోధపరుస్తాను. నేను మన ఆడాళ్ల బాగు కోసమే నాజీవితం అంతా గడపాలని నిశ్చయించుకున్నాను. నేను వుద్యోగం చెయ్యను. మా అమ్మా, మా నాన్నగారూ ఇష్టమైతే పెళ్ళాడమంటూనే వున్నారు; గాని యిందుకోసం నేను పెళ్లి మానుకున్నాను. మన వూళ్లో మన ఆడాళ్లంతా యెంతెంత యమచర అనుభవిస్తున్నారో మీ రంతా యెరుగుదురు. అదంతా పోగొడతాను నేను. మీరంతా నాకు సాయం అయితే మీ సుఖపడతారు''

ఇది విని అందరూ "అవున్రా'' అంటే "అవున్రా'' అన్నారు. 'నరసింహ చయనులుగారి మూడో పెళ్ళాం వెంకటరత్నమ్మ "మేమంత రేపు మీ యింటికి వస్తాం, మంచీ చెడ్డా చెప్పమ్మా'' అనగా వెంకటశాస్త్రిగారి రెండో పెళ్లాం కృష్ణవేణి "రేపే అన్న మాటేమిటి? పని లేని పు[illegible]కింతాలు కల్పించుకుని కేష్టంలో పడ యీగలాగ కొట్టుకోడమే కాదూ యిళ్లలోనూ? రోజూ వె[illegible]దాం, మాకు సంగతు లన్నీ చెబుతూ వుండవే కొండలా'' అంటూ జానకి చెయ్యిపట్టుకుంది.

[illegible]తయితే మరి మరిచెద. మీకందరకీ నేను చదువుకూడా చెబుతాను. మధ్యాహ్నం రెండు మొదలు అయిదింటి దాకా యెవళ్లకీ పను లుండవు. మొగాళ్ళేం అడ్డుపెట్టినా మీరంతా మాయింటికి రావాలి'' అని జానకి వారికి ప్రోత్సాహం చేసింది.

అప్పుడులచ్చమ్మ జానకి రెండుచేతులూ పట్టుకుని "నువ్వీరాత్రి మాయింటో వుండవుటే కూతురా'' అని ప్రార్థేయపడింది. సుందరి కూడా "రావుటే అక్కయ్యా?'' అని జాలిగా అడిగింది. దాని మీద జానకి అతిప్రేమతో సుందరి కణతలమీద మెటికలు విరిచి "మరి నేను చెప్పిన ట్లా వింటావా యెప్పుడూనూ?'' అని అడుగుతూ గభీమని చంకబెట్టుకుని ముందుకి అడుగు వేసింది.

విభ్రమము

శ్రీ జమ్మలమడక మాధవరామశర్మగారు

రూపకములు పరస్పర మభినయాత్మత నభిన్నము లైనను నాయకభేదమున భిన్నము లగుచున్న వని "వస్తు నేతా రస స్తేషాం భేదకః" యని దశరూపకము పల్కుచున్నది. నాయకుడు శృంగారి యయిన నవశ్యముగ నాయికా ప్రతిపాదన ముండును! యువతీవిషయిక చర్యలు గ్రన్థమున స్థానము గైకొనినపుడు లలితము లగు వారల గుణముల స్వభావములఁ జెప్పక తప్పదు. అందువలననే యాలంకారికులు తమ గ్రన్థములందు నాయికా నిరూపణావసరమున దత్తద్భేదముల బరిగణించి వారి మాన్మథదశలను జెప్పి స్వాభావిక హావభావాదులను, వికృతిజన్యభావాదులను నిరూపించుట యాచారముగ నున్నది.

విభ్రమ మనునది శృంగారభావములం దన్యతమము. దీని వికృతిజన్యత లక్షణమువలననే వ్యక్తమగుచున్నది. ధనంజయుడు "విభ్రమ స్త్వరయా కాలే భూషాస్థానవిపర్యయః" అని దాని లక్షణమును జెప్పుచున్నాడు. నాయిక యలంకరణాభిలాషిణియై శీఘ్రముగ నలంకరించుకొనుచున్నప్పుడు మన మన్యాసక్త మగుట భూషలకు స్థానవిపర్యయము గలుగునేని విభ్రమ మని లక్షణాభిప్రాయము భూషలకు స్థానవిపర్యయము విభ్రమమె యగును; కాని యావిపర్యయ మననెట్టిదో విచారణీయాంశము, ఇది యౌచితీసహిత మని మనము భ్రమనొందక సుదీర్ఘముగ నాలోచించితి మేని విభ్రమ తత్త్వమును గ్రహింపజాలుదుము, పరమముగ్ధ యగు యువతియు కళ్ళు మూసికొని యైనను మన మన్యాసక్త మగుట నవశ యైనను గడియమును జేతికి గంకణమును గాలికి ధరింపదు. ఉంగరమును మెట్టెగ జేయదు. కంటెను మొలకు ధరింపదు. వలయమును మెడలో ధరింపదు. ఇవి లోకప్రకృతి యని సర్వలోకవిదితము. స్త్రీలు పరవశ లయి నపుడు భూషావ్యత్యయము జరుగ దన సాహసింపము. కాని యది యౌచితీవిశిష్టముగ లోకసంభావ్యముగ నుండు నని మనవి. తొందర యగుట వలన నొకరివి వేరొకరు ధరింపవచ్చును. వామ మంజీర మవామ మగు కావచ్చును. దక్షిణకర్ణపూర మదక్షిణకర్ణపూరము కావచ్చును. ముక్కుల పుడకలు వ్యత్యస్తములు కావచ్చును. కజ్జలధారణాదులందు శలాకావిపర్యాసము గలుగవచ్చును. ఉత్తరీయపరిధానీయవ్యత్యము సంభవింపవచ్చును; గాని మన యాలంకారికులు కొందఱు వర్ణించినటుల కాదని యావర్ణనలు ప్రకృతివిరుద్ధము లని లోకాసంభావ్యము లని యౌచితీరహితము లగుట నవిశ్వసనీయము లని హాస్యాస్పదము లగు నని నాయూహ. ఇట్టివర్ణనము సామాజికహృదయోద్వేగజనక మగును గాన వైరస్యాపాదక మయి వారి చిత్తవృత్తిని జర్వణోన్ముఖ మొనర్పలేదు. ఒకొక్కచో ననౌచిత్యము రసోద్బోధనసమర్థనము రసపోషకము కావచ్చును; గాని ప్రకృతము చర్చింపబడు విభ్రమానౌచిత్య మెట్టి పోషణమును జేయలేదు. ప్రతినాయకాదిగతముగ ననౌచిత్యము ఘటింపబడినపు డది ప్రకృతరసప్రతీపకము కాకపోవుట "బ్రహ్మన్నధ్యయనస్య నైష సమయ స్తూష్ణీం బహి స్స్థీయతామ్" ఇత్యాదులందు దృష్టచరము. సజాతీయగతముగ ననౌచిత్యఘటనము ప్రకృతరసప్రతికూలము కాకపోదు. ఈవిభ్రమవర్ణన మనునది సజాతీయప్రతిష్ఠము. ఇందలి యనౌచిత్య ముద్వేగకరము. అలంకారములకు గుణములకు నుచితస్థానవిన్యసనమున నౌచితీవైశిష్ట్యముననే శోభ గల్గు నని లేకున్న నవి యాశబ్దవ్యవహార్యములు కాజాలవని క్షేమేంద్రుడు తన మహదాశయమును

"ఉచితస్థానవిన్యాసా దలంకృతి రలంకృతిః
ఔచిత్యా దచ్యుతా నిత్యం భవ న్త్యేవ గుణాగుణాః"

"అలంకృతి రుచితస్థానవిన్యాసా దలంకర్తుం క్షమా భవతి. అన్యథా త్వలంకృతివ్యపదేశ మేవ నలభతే; తద్వ దౌచిత్యా దపరిచ్యుతా గుణాగుణతా మాసాదయన్తి. అన్యథా పున రగుణా ఏవ" అను గ్రన్థమువలన వ్యక్తము చేయుచున్నాడు. అనౌచిత్య ప్రతిభానమున గల్గు సామాజికోపహాసమునకు బర్యాప్తము కాగల్గుటయె విభ్రమకృత్య మని "ఉపహాసితు మేష ఇష్టః" యను రసమీమాంసయందలి జడ్యుపనామక గంగారామోక్తి నూతిగా గొని, పల్కిన "విభ్రమాయ నమో నమః" విభ్రమ ప్రయోజన మంతియ కాదని తత్త్వజ్ఞు లెరుంగుదురు. ఆలంకారికులు తమ గ్రన్థములందు విభ్రమము నేరీతి వర్ణించిరో, యెంతటి యౌచిత్య మం దున్నదో యందలి ఘటన రసపోషక మగుచున్నదో లేదో సహృదయులు ప్రజ్ఞాదృష్టితో జూడవలయును. అప్పారాయయశశ్చంద్రోదయమున (ఆణివిళ్ల వేంకటశాస్త్రిగారు దీనికర్తలు) విభ్రమలక్షణము.

"విభ్రమ స్త్వరయా కాలే భూషాస్థానవిపర్యయః" అనియే యున్నది.

దీని యుదాహరణము.

నిశమ్య కేళీశ రణప్రయాణం
అళీముఖా త్సమ్మదనిర్భరాంగీ।
కాంచీగుణం కంఠతలే న్యధత్త
బబంధ హారం జఘనే నృసింహ॥

అని యున్నది.

పర్వతజఘన ధరించు కాంచీవలయ మెంత యుండునో. కంబుకంఠమున నుండు హార మెంత వలయమును గలిగియుండునో యాభూషలు విపర్యయసహము లగునేమో సహృదయు లాలోచింత్రుగాత.

(2) హేమచంద్రుడు కావ్యానుశాసనమున

"వాగంగభూషణానాం వ్యత్యాసో విభ్రమః" అను విభ్రమలక్షణసూత్రమునకు "వచనేఽన్యథా వక్తవ్యేఽన్యథా భాషణం హస్తే నాదాతవ్యే పాదే నాదానం రసనాయాః కంఠే న్యాసః" అను వృత్తినిగూఢ విస్పష్టముగ వ్రాసి

"ఏకార కాచి త్సితచందనాంకే
కాంచీకలాపం స్తనభారపృష్ఠే।
ప్రియం ప్రతిప్రేషితచిత్తవృత్తిః
నితంబబింబే చ బబంధ హారమ్"

అని మూడవ భేదమునే యుదాహరించెను. వెనుకటి యుదాహరణమువలెనె యిదియు నున్నది. భూషావిపర్యయమార్గమును గూడ నితడు వృత్తిలో జూపినాడు. 3 విద్యానాథుడు భూషల విపర్యయమునె విభ్రమలక్షణముగ చెప్పి "శ్రుత్వా సఖీముఖా ద్దివసో విరత ఇతి సంభ్రమేణ వధూః హస్తయో ర్నూపురే చరణయోః కరోతి వలయాని" అని యుదాహరణమును వ్రాసినాడు. ఇచట నూపురవలయములకు సమానవలయత్వ ముండవచ్చునను నూహతో గవి వ్రాసియుండవచ్చును. కాని వలయములు చరణముల కెట్లు సరిపడునో సహృదయు లాలోచింపవలయును. (4) సాహిత్యరత్నాకరమున

"రామాసంగత్యసనరభస
స్వాంతయా కాంతయా సీత్
పాణౌ హారో ఝుడితి ఘటితః
కంకణం కంఠనాళే
కాంచీసూత్రం కచపరిసరే
కాంచనస్రజ్ నితంబే
లాక్షాలక్ష్మీ ర్నయననళినే
కజ్జలం పాదపద్మే—"

అను నుదాహరణ మున్నది. ఈయది బాగుగ గుదిరిన దని కవి తలచి యుండును. ఇదివరలో వ్రాసిన పద్యములందు నాయిక లొనరించిన చేష్టలను నావర్ణనలను నేదో విధముగ (కష్టముగ సమర్థించుకొని) నంగీకరించినను నీపద్యమునం దెట్లు సమర్థింప నగు? కంకణము కంఠనాళమున నెట్లు పట్టును? కరమున హారము సంగత మగునా?

వెంటనే జారి యాభరణము ధృత మయిన దని యనుకొనుటకు గూడ నవకాశము లేకుండ పడి పోకుండునా? కంకణములే కృశకరమున జారిన వని.

యామి న యామీ తి ధవే
వదతి పురస్తాత్ క్షణేన తన్వంగ్యాః
దలితాని పురో వలయా
న్యపరాణి పున స్తథైవ గళితాని.

మొదలగు పద్యములు చెప్పుచున్నవే. లత్తుక కండ్లకా? కాటుక పాదములకా? మూడు కాటుక భరణుల కాటుక యయిన నొక పాదమునకు జాలదే ఎట్లామగువ సరిపుచ్చుకొనినదో?

సాహిత్య దర్పణము నిర్ణయసాగర యంత్రము ద్రిత గ్రంథమున.

త్వరయా హర్ష రాగాదేః దయితాగమనాదిషు।
అస్థానే విభ్రమాదీనాం విన్యాసో విభ్రమోమతః

అని లక్షణమును.

కృత్వా యాంతం బహిః కాంత
మసమాప్త విభూషయా।
ఫాలేంజనం దృశో ర్లాక్షా
కపోలే తిలకః కృతః॥

అని రత్నాకరో దాహరణ సదృశో దాహరణ మును గలదు. ఇట్లాలంకారికుల గ్రంథములనే కాక గొన్ని కావ్యములందును నౌచితి లేని యుదాహరణములు గన్పించుచున్నవి. మాఘుని కావ్యము 13 సర్గలోని.

రభసేన హారపద దత్తకాంచయః
ప్రతిమూర్ధజం నిహితకర్ణ పూరకాః।
పరివర్తితాం బరయుగా స్సమాపతన్
వలయా, కృతశ్రవణ పూరకాః స్త్రియః॥

శ్రవణ పూరకములు వలయాకరణము నొందునా? యని సహృదయు లాలోచింపవలయును. ఆంధ్రాలంకారిక గ్రంథములందును నిట్టి లక్ష్యములు కన్పడుచున్నవి. అనంతామాత్యుని రసాభరణమున. "సంభ్రమమున దొడిగెన్ గరముల నంది యలంగాళ్ల గరవలయముల్." అని ఉదాహరణము గలదు. దీని యుపపత్తి యెట్లో విచారింపవలసిన భారము పాఠక భ్రాతలపై నున్నది. కవుల గ్రంథములందును నిట్టివి గలవు.

"అన్నులమిన్న యొత్తు వసు
ధాధిపనందను జూడగోరి వా
ల్గన్నుల గుంకుమంబు నొస
లన్నకజ్జలమున్ ధరించి లో
నెన్నగరాని తత్తరము
హెచ్చగ నచ్చుగ రాజపద్ధతిన్
గ్రన్నగ వచ్చె దాని గని
గామిను లందరు నవ్వి రొక్కటన్"

(రసికజన మనోభిరామము 1—18—89)

బిత్తరి యొత్తు ముత్తియపు
పేరు వలగ్నమునన్ ఘటించి కే
ల్గుత్తపు చన్నుదోయి నొన
గూర్చి రయంబున జూడ వచ్చె.

(మనుచరిత్ర 6—14)

కవు లందరు నిట్టి పద్యములనే రచించి రన సాహసింపను.

రమ్య తరములు నుపపన్నము లగు నుదాహరణముల నాలంకారికులు గూడ రచించిరి. భానుదత్తుడు రసతరంగిణిలో.

త్యక్తే కేళివిధౌ నిజాంశుకధియా
పీతాంబర స్యాంశుకం
పద్మాయాః పరిధాయ సద్మశయనాత్
ప్రాతః ప్రయాంత్యా బహిః
ఆదాతుం వసనాంచలం చపలయన్
కోపం దృశా దర్శయన్
వాచా కౌతుక మాచరన్ స్మితసుధా
స్నిగ్ధో హరిః పాతు నః॥

అని యుదాహరించెను. ఇచట వస్త్ర వ్యత్యయము జరిగినది. ఇం దనౌచిత్యము ప్రతిభాత మగుట లేదు. మాఘునిపై యుదాహరణమున గూడ

"పరివర్తితాం బరయుగాః" యనునది యెంతయు రమ్యతరము.

నరస భూపాలీయగత మగు.

అదన నృసింహభూమిరమ
ణాగ్రణి వచ్చిన సంభ్రమంబుతో
సుదతి నభోవలగ్నమున
జుక్కలపేరిటి కంఠమాలయున్
బొదలు కుచాచలంబుల స
ముజ్జ్వల మేఖలయున్ ధరింపగా
నది క్రమ మయ్యె దొయ్యలికి
నక్రమ మయ్యె విలాసశేఖరిన్.

అను పద్యమున రెండు భూషణములకు సమాన వలయత్వ మంగీకరించి సమర్థింపదలచి నపుడు కృశ మధ్యమున కంఠమాలయు గుచాంచలముల మేఖలయు నుంట నంతగా నుపపత్తిహీనము గాదు. అయినను హారమును గటిపై ధరించుట ఎట్లు పొసగునా యని సంశయము. ఒడ్డాణము వలె దీని తగిలించుటకు దగినట్లుగా జుక్కలపేరిట కంఠమాల లప్పటిలో నిర్మింపబడెనను నిశ్చయము మన కున్నపుడు నభోవలగ్నముల నట్టి వాని ధరించుటలో సందియ ముండదు. తీసి తగిలించుటకు తగియుండుటలు వానికి లేనపుడు మాయీ యాక్షేపము ప్రసక్త మగును. "ముత్తియపుపేరు వలగ్నమునన్ ఘటించి" యను వసుచరిత్ర పద్యఖండమునకు వ్యాఖ్యాత యభిప్రాయాను గుణముగ "ముత్యాల హారము నడుమున దోపుకొని" యను నర్థము నే రొప్పికొందు మేని ప్రసక్తాక్షేపము పరాస్తమగును. ఈ విభ్రమోదాహరణములందు దరచుగ ప్రాచీను లుట్టంకించిన యభిప్రాయమునె నవీనులు వాడుచున్నారు. ఇందు ప్రదర్శించిన యుదాహరణము లందే "హారమును గటిపై ధరించుట, మేఖలను మెడలో ధరించుట, లాక్షాద్రవ్యమును నేత్రముల బెట్టికొనుట, కాటుకను పాదముల బెట్టుకొనుట, వలయములను గాళ్ల ధరించుట కడియముల (అందియల) కరములకు దగిలించుట" యను నవి సాధారణముగ నన్నిటియందును గానవచ్చుచున్నవి. ధర్మసూరి, విశ్వనాథ, మాఘ, భానుదత్త, కూచిమంచి తిమ్మకవుల పద్యములందు బూర్వపు వర్ణన లున్నను గొంత నూతనత గన్పించుచున్నది. ప్రభువు పట్టణమున బ్రవేశించునపుడు స్త్రీ లలంకరింప దలచుట, యాయలంకరణ కృత్యమున వ్యత్యయము జరుగుట ఇదియే అన్నిటియందును గల సందర్భము. భానుదత్తుని పద్యమున నూతనతాభివ్యక్తి యున్నది. విభ్రమవర్ణన మాచారముగ బెట్టుకొని కవులు వర్ణించినట్టుగ దోచుచున్నది. ఆలంకారికులు లక్షణకర్తలగుట వారు పై యుదాహరణముల దీసికొని యుందురు. ఉచిత ప్రతిభాన ముండగా ననుపపన్నత్వ శంక యుత్పన్నము కాదని విభ్రమతాహానిని దలపరాదు. ఔచితీ సహిత పద్యభావచర్వణావసరకాలమున భూషణములకు స్థానవ్యత్యస్తత్వకృతమగు జమత్కారము సామాజికపు టెద నుత్పన్నము కాకమానదు. ఔచిత్యము ప్రతిభాసమగుచునుండునట్లుగా భూషావ్యత్యస్తత్వ మున్నచోట విభ్రమత్వభంగము లేదు. ఇచట నొకటి యాలోచింపదగిన విషయము. భూషణవిపర్యయము భ్రాంతిచే జరుగును. భ్రాంతి సాదృశ్యమూలక మని సర్వప్రతిపన్నము. సమానాకారత్వ పరిమాణతాదు లున్నపుడే సదృశజ్ఞాన ముత్పన్న మగును. కథితోదాహరణములందు సాదృశ్యమూలక భ్రాంతి యేయే యాభరణములందు గలుగుట కవకాశము గలదో భావుకసోదరులు భావింపవలయును.

క్షేమేంద్రుడు విభ్రమోదాహరణములం దుచితత్వభంగము నుపలక్షించియే.

"కంఠే మేఖలయా నితంబఫలకే
తారేణ హారేణ వా
పాణౌ నూపురబంధనేన చరణే
కేయూరపాశేన వా।
శౌర్యేణ ప్రణతే రిపౌ కరుణయా

నాయూంతికే హాస్యతాం
ఔచిత్యేన వినా రుచిం ప్రతనుతే
నాలంకృతి ర్నో గుణః ॥

అను శ్లోకము నుదాహరించినాడు.

భాషాస్థాన విపర్యయత్వమే విభ్రమలక్షణ మనుట యపర్యాప్తము. హేమచంద్ర భానుదత్తాదులు చెప్పినట్లు వచన విపర్యయము, ఆంగిక విపర్యయము (హస్తే నాదాతవ్యే పాదే నాదానం) అనునట్లు కూడ విభ్రమమే యనుట యుక్తము. ఇందువలన గోత్రస్ఖలనము విభ్రమ గృహీతము కాగలదు. రసమీమాంసకర్తయు దన ఛాయాటీకలో "అన్యదీయ నామగ్రహణ ప్రసంగే న్యదీయ నామగ్రహణం విభ్రమకః" అనుచున్నాడు. దీనికి.

పద్మే త్వన్నయనే స్మరామి సతతం
భావోభవ త్కుంతలే
నీలే ముహ్యాతి కిం కరోమి మహితైః
క్రీతోస్మి తే విభ్రమైః ।
ఇత్యుత్స్వప్నవచో నిశమ్య సరుషా
నిర్భర్త్సితో రాధయా
కృష్ణ స్తత్పర మేవ తద్వ్యపదిశన్
క్రీడావిటః పాతు వః ॥

అనునది యుదాహరణము కాగలదు. అంగవ్యత్యయరూప విభ్రమమున కుదాహరణ మన్వేషింపవగును. కవులు రసజీవితభూత మగు నౌచిత్యము చ్యుతము కాకుండునట్లు రచనల జేయుట రసస్ఫురణహేతు వగును. అనౌచిత్యము కూడ రసపోషక మగు నని తలంచి యంతట యుక్తాయుక్త విచారణ లేక యనౌచిత్యమును ఘటింపదలంచుట మహానర్థదాయకము. ఔచిత్యభ్రంశముననే మహాకవులకు కూడ నాలోచనాశూన్యత్వము కల్పిత మయినది. వ్యంగ్యసర్వస్వభవన మని తలంపబడు "భ్రమ ధార్మికవిస్రబ్ధః" అను కారికలో ననౌచిత్యము నుట్టంకించి మహిముఁడు దూషించినాడు. కాన సహృదయులు ఈ వ్రాతల జూచి వెంటనే యాపగరాని యుద్వేగమును బొందక తత్వపరిశీలన మొనర్చుచు,

"తస్మా ద్యత్నేన కర్తవ్యం
కావ్యం రసనిరంతరమ్ ।
అన్యథా శాస్త్రవిద్గోష్ఠ్యాం
తత్స్యా దుద్వేగకారకమ్ ॥

అను శృంగారతిలక కర్త వాక్యమును దమ సుహృదయమును భావన చేయుచు లోకకల్యాణమును బరానందమును గూర్ప ప్రయత్నించుట యుచితము. శ్రేయము.

తగిన శిక్ష

శ్రీ శేషాద్రి రమణకవులు

భరతఖండమునఁ గల యితరప్రదేశముల కంటె మహారాష్ట్రదేశము భక్తపూజనమున అగ్రగణ్యము. నిజానందస్వామి మహోత్సవము ప్రతిసంవత్సరము కర్హాడులో మహావైభవముగ జరుగును. త్యాగధనుఁడు శివాజిచక్రవర్తి తన బొక్కసమునుండి వలసినంత ధనమా యుత్సవ వ్యయములకుఁ బంపుచుండును. ఉత్సవదినములలో నిజానందస్వామి సమాధిచెంత గల శిలామండపము లన్నియు జనాకీర్ణములై యుండును. ఒకచోట భజనములు, ఇంకొకచో హరికీర్తనము, ఒక యెడ ఉపన్యాసములు

ఇంకొకయెడఁ బురాణకాలక్షేపములు ఏచటఁజూచిన భక్తిరసప్రవాహమున భక్తు లోలలాడుచుందురు. అవతారపురుషుఁ డగు నిజానందుని లీలల స్మరించుచు ఆమహానుభావుని దివ్యచరిత్రామృతము గ్రోలుచు భక్తులు కర్హాడునగరము నామహోత్సవదినములలో భూలోకస్వర్గముగఁ దలంతురు.

ఒక్కొక్కతఱి శివాజిచక్రవర్తియు నుత్సవమున సందర్శింప సముచితపరివారముతోఁ బాదచారియై నిజానందుని సమాధికడకు వచ్చి సామాన్యజనునివలె వర్తించును. ప్రత్యేకపరిచయము గలవారు దక్క సామాన్యులు శివాజిని గుర్తింపఁజాలరు. నిరాడంబరులును భక్తిరసపూర్ణులు నగు భక్తులలో నాఁడు శివాజి యొకభక్తుఁడు. ఒక గాయకుఁడు. ఒక ధర్మోపన్యాసకుఁడు. ఒక వేదాంతి. ఇంత యుత్తరదేశస్థులకు విషయ మవగతమగుటకై వక్త తన యభిప్రాయమును కర్ణాటాంధ్రభాషలలోఁ గూడ సంగ్రహరూపముగ నుపన్యసించెను.

ఆపరమ భక్తుఁడెవఁడు? ఆజీవన్ముక్తుఁడెవఁడు? ఆ లోకోద్ధారకుఁ డెవఁడు! వాక్కులలో నమృతము, ముఖమున నిష్కళంక మగు ప్రేమరసము, అవయవములలో నిండు జవ్వనము నిండారు నాయోగి స్వస్తిపలికించి నాటి యుపన్యాసము ముగించి యెందేని చనెను. జనసమూహములో నున్న ముప్పది మంది బాలసన్న్యాసులు జయ జయ, మహావీర, జయజయ సమర్థరామదాస, జయజయ యనుచు జయనినాదములతోఁ వెంట నేగిరి. సింహభల్లూకవ్యాఘ్రాది క్రూరమృగశరణ్యమగు నొక పర్వతరాజమునకా యోగి బృందము జేరి యనంతర మదృశ్యు

నిలయములఁ బరిశీలించిరి. లోకోద్ధారకుఁడగు రామదాసస్వామి యునికియే యెవరికిఁ దెలియలేదు. ఆయన యెచట విశ్రమించెనో భిక్ష యెచట స్వీకరించెనో యీ యర్ధరాత్రము నెందు జేరెనో యని ప్రజలు చెట్టునకొకరు గుట్టకొకరై వెదకఁజొచ్చిరి, ఎచటఁజూచిన రామదాసస్వామి దివ్యనామస్మరణమె! ఎటఁగాంచిన రామదాసస్వామి నన్వేషించు యోగి సముదాయమె లెక్కకు మిక్కుటమయ్యెను. ఈ నేల యీనినటులున్న యోగి బృందములో రామదాసస్వామి యెవఁడై యుండునో యెవరు నిర్ణయింపఁగలరు. నిజానందుని యుత్సవమంతతో నాగి యది రామదాస్వామి యన్వేషణగా మారిపోయెను.

మిట్టమధ్యాహ్న మాయెను. రామదాసస్వామి కొఱకు వెదకి వేసారిన యోగిగణము గ్రామములకుఁ జేరుచుండెను. కొందఱు ముందుగా సజ్జనగడమునకుఁ బోతిమేని శివాజీని దర్శింపనేగు రామదాసస్వామిని జూడనగునని త్రోవయనక డొంకయనక రాజమందిరము నభిముఖముగా నుఱుకుచుండిరి. ఈ యలజడి యంతయు జూచుచు శిష్యులకుఁ బరమార్థరహస్యముల నుపదేశించుచు నొకయోగి చెంతగల సెలయేట స్నానాదికృత్యములఁ గావించుకొని యొక్క జొన్నచేని మధ్యగల కాలిబాటను బోవుచుండెను. అపరిపక్వ బుద్ధులగు శిష్యులకు గురూపదేశమునకంటె జొన్నచేనే యుత్సాహకరముగ నుండెను.

శిష్యులందఱు గురుని సమీపించి "ఇప్పటికిఁ బదిగడియలకంటెఁ బ్రొద్దెక్కువ యెక్కినది. ఎండ తీవ్రతరముగఁ గాయుచున్నది. ఉపవాసలోలురగు తమ సంగతి మేము తెలుపఁజాలము గాని మాకు మాత్రము కాళ్లు తడబడుచున్నవి. దుస్తరమగు క్షుద్బాధచే నవయవములు శక్తిహీనము లగుచున్నవి. ఈచేనిలోనికిఁ బోయి జొన్నకంకులఁ దినుట కాజ్ఞ యిండు. లేకున్న బ్రదుకఁజాలమని బ్రతిమాలుకొనిరి. గురుని హృదయము కఱగిపోయెను. బాలురు సుకుమారులు నగు శిష్యులు తీవ్రతరోపవాసములచేఁ గృశించుచున్నారు. సజ్జనగడమునకేగి శివాజీ నృపుని ధర్మసత్రమున విందారగించు వఱకుఁ బ్రొద్దు తిరుగును. అంతదనుక వీరలాగఁ జాలరు. సజ్జనగడము ఇంక నెంతలేదనినను జాము ప్రయాణము. పోనిమ్ము. కంకులఁ దినుమని యానతిత్తునా? ఈ క్షేత్రపాలు ధనము అన్యాయముగ నేను హరించినట్లగును. కర్తవ్యమేది? అంతదనుక వచ్చిన క్షేత్రస్వామిని దృష్టిపఱుపలేక పోవుదునా! యని యోగిశిష్యులకు బదులు చెప్పక చేనుకట్టపయిఁ గల తాతిపయిఁ గూర్చుండి జపముచేసికొనుచుండెను.

జొన్నచేను మంచి ఊఁచబియ్యపుఁ దరుణమున నుండెను. సారవంతమగు క్షేత్రమగుటచేఁ గంకికి దోసెఁడుగింజలు రాలు నటులుండెను. ముప్పది శిష్యులు చేను నలుగెలంకులఁ దిరిగి పరువమగు కంకుల మోపుదెచ్చి యొక సమప్రదేశమునఁ గూర్చుండి గింజలుదీసిరి. భిక్షాపాత్రములలో నూచబియ్యము పోసికొని సంతోషముగా నందఱు నములుచుండిరి. యోగీశ్వరుఁడీ శిష్యులచర్యల పయి లక్ష్యముంచక సమాధిమగ్నుఁడై యుండెను. పొలముకాపు చేనిలోనికి వచ్చుసరికి శిష్యులు ఊచబియ్యము నములుట, చెంత కంకులు రాసిగనుంట, యీ క్రియ యంతయు నడుపుచున్న పడుచుసన్యాసి శిలపయి కూర్చుండి జపము గావించుట గోచరించెను. సన్యాసుల త్యాగజీవితము, యోగీంద్రుని నిశ్చలస్థైర్యము నెఱుంగని యాకాపుచేతనున్న కఱ్ఱ విసరుచు బాలసన్యాసుల వెంటబడి దొంగలారా! నిలువుఁడు. మీచర్మము లొలిచెదను. మిమ్ము చేనికి బలిపెట్టెదను. పాఱిపోకుఁడని వెంటఁబడెను. శిష్యులందఱు చకితులై తలకొక దిక్కునఁ జెదరి పాఱిరి. కాపువాఁడు సన్యాసుల భిక్షాపాత్రములు పగులఁగొట్టి క్రోధముతీఱక ఒకసన్యాసినైనఁ గని దీఱఁ గొట్టనైతినే యని చేను నలువైపులఁ దిరుగసాగెను.

మంచె చెంతఁగల నిలువుఱాతిపయి గూర్చుండి సమాధినిష్ఠలోనున్న యోగీంద్రుని సమీపించి కాపు చాలసేపు పరుషభాషలాడెను. ప్రత్యుత్తరము రాలేదు. వీడె దొంగసన్యాసి. శిష్యులచేఁ జేనుదోయించి కొంగజపము జేయుచున్నాఁడు. వీనిని శిక్షించినఁగాని ఈత్రోవను నడచు బాటసారులకు బుద్ధిరాదు. అని చేతిలోని కఱ్ఱతో యోగిచంద్రుని యొడలెల్ల నెత్తురుక్రమ్మ కదుములుగట్టునటులఁ గొట్టి కాపు వెనుకకుమఱలెను. దూరమునకుఁ బరుగిడిన శిష్యులు వెనుదిరిగి తమదేశికుని నకారణముగాఁ గాపువాఁడు కొట్టినందులకు మిగుల వగచి ఒంటరిగానున్న నీతని పొగరణఁపవలయునని కాపును గొట్టబోయిరి. యోగీశ్వరుఁడిది యంతయుఁ జూచి శిష్యులనందఱఁ జేరఁబిల్చి బిడ్డలారా! క్రోధమునకు మీ పవిత్రహృదయములలోఁ దావొసంగకుఁడు. కొలఁదికాలములోఁ బశ్చాత్తాపతప్తుఁడై కాపువాఁడు తగుశిక్ష నొందకపోఁడు. వెనుకకుఁ దిరుగుఁడు. నేఁటి యీవిపరీతకథ మీ రెవరికి నెఱింగింపకుఁడు. గతమునకుఁ జింతిఁపకుఁడు అనుచు సజ్జనడమునకుఁ బ్రయాణమయ్యెను.

ఒడలెల్ల రక్తము క్రమ్ముటచే యోగి నడువనశక్తుఁడయ్యెను. తూలితూలి పడుచుండెను. శిష్యుల యవలంబనముతో నెట్టులో గడియ కొక యడుగిడుచు బాధాలక్షణముల మొగమునఁ దోపనీక శరీరమును గాషాయముతోఁ గప్పుకొని యోగీశ్వరుఁడు శిష్యసహితముగ సజ్జనగడము చేరెను.

3

రామదాసస్వామి తీర్థయాత్రలకు జనోద్ధరణమునకుఁ బోయి చాలకాలమయ్యెను. శివాజిచక్రవర్తి గురువర్యుని వెదకుటకుఁ బరివారమును బంపెను. తాను స్వయముగ వెదకుటకు బయలుదేరెను. ఎటనుండెనో యెన్నఁడువచ్చునో తెలియదు. నాఁడు గూఢచారులు రామదాసస్వామి కర్హాడునుండి సజ్జనగడమునకు బయలుదేరెనని శివాజి కెఱింగించిరి. శివాజి యానందమునకు మేరలేదు. గురువర్యుని సందర్శనభాగ్యము చిరకాలము పరితపింప నాఁడు లభింపనున్నది. ఎంతధన్యుఁడు. శివాజి ఎంతధన్యతగుఁడు.

శివాజి సపరివారముగా గురువర్యునెదుర్కొని కొనివచ్చుటకుఁ బురబహిర్భాగమునకుఁ జేరుసరికిఁ బరస్పర సమ్మేళనము జరిగెను. శివాజి నయనములనుండి యానందరసము ప్రవహించెను. ఒడలు పులకించెను. కంఠము గాద్గద్యము వహించెను. సువర్ణపాత్రమునఁ దెచ్చి గురువర్యుని పాదములు గడిగి యుత్తరీయముతోఁ దడియొత్తి శివాజి గురువర్యుని యడుగుజాడల ననుసరించి నడచుచుండెను. ప్రేమరసదృష్టితో శివాజినిజూచి మీఁదఁ జేయివైచి రామదాసస్వామి యిట్లు మధురస్వరమునఁ బలికెను.

"శివబాబా—ఒక భిక్షుకునికి గుప్పెడుగింజల గంజి బోయుటకింత యాడంబరము ప్రకటించుకొనవలయునా?"

"గురుదేవా! ఈసామ్రాజ్యము నీది. నీ ప్రధానభటుఁడ నేను. వీరందఱు మీ పాదసేవకులు. ఈరాజ్యమె భిక్షుకరాజ్యము. ఇందాడంబరమేమున్నది."

"ఈతేప దక్షిణభారతమును సమగ్రముగా దర్శింపఁగలిగితిని. లోకవృత్తమెంతయో కనుగొంటిని"

"స్వామీ! మీ కసాధ్యమేమున్నది? నా ప్రార్థన మిది. మీకు నలుబదియేండ్లు దాటుచున్నవి. ఉపవాసవశమున మీ యొడలిలో రక్తమాంసములు తగ్గినవి. మొగమంతయు వాడిపోయినది. నడచునపుడు మాటలాడునపుడు ఏదో యశక్తత గోచరించుచున్నది. స్వామీ! ఈదీనుని కటాక్షించుచుఁ దాము నా జీవితశేషమువఱకైన సజ్జనగడమున వసింపరాదా?"

"శివబాబా! లుప్తమైన ధర్మమును బునరుద్ధరించుట నా యాశ్రమధర్మము. నీ ధర్మము నీవు స్వీక

మముగా నిర్వర్తించుచున్నటుల నేనుమాత్రము నిర్వర్తింపవలదా? ఉండవలసిన తరుణమున నీయొద్ద కాక యింక నే నెచట నుందును?”

ప్రసంగ మింకను జరుగుచు నే యుండెను. రామదాసస్వామియు శివాజియు అభ్యంతరమందిరమున కేగిరి. శిష్యులందఱును భిక్షుకశాలకు వెడలిరి. ఏకాంతగృహమున శివాజియు రామదాసస్వామియుఁ గొంతసేపు మాటలాడుకొనిరి. ప్రజలసందడి తగ్గెను. నాఁడు బడలికగానున్నదని స్వామి శివాజి నిర్బంధముచే రెండు మూఁడు ఉద్ధరిణల అవుసాలు త్రాగివిశ్రమించెను. శివాజికిఁ జాల యాందోళన కలిగెను. నేటి పరిచయమా గురుదేవునితో! బడలిక [illegible] దోషి నెటెంగింతురా? ప్రాణత్యాగము జేసికొమ్మందురా? యని శివాజి సమర్థుని పాదము లొత్తుచుఁ బ్రార్థించెను.

సమర్థుఁడు చిఱునగవుతో శివాజిని జూచి శివబాబా! భక్తుఁడొకఁడు గురుపూజ యీవిధముగ నొనరించినాఁడు. ఇందు నీ వాందోళన పడఁబని లేదు. ప్రపంచాతీతులకు దూషణభూషణ తిరస్కారములు సమానములు. అని శివాజి నోదార్చెను.

శివాజి వెంటనే భిక్షుకాలయమునకేగి శిష్యులను బ్రశ్నింపఁ జరిగిన సంగతియంతయుఁ బూసగ్రుచ్చినటులఁ దెలిపిరి. ఉగ్రమూర్తియై శివాజి భటులఁ జూచి ఱేఁపు తెల్లవారువఱకు నా గురుదేవుని [illegible]

వర్గము తమతమ తావులలో నధివసించిరి. అప్పటికి జాము ప్రొద్దెక్కియుండునేమో! రాజభటులొక కాపువాని గొనివచ్చి రాజుముందు నిలువఁబెట్టిరి. శివాజి వానిని జూడఁగనె న్యాయాధిపతులతో "ఈపాపి నా గురుమూర్తిని గొట్టినాఁడు. తగినశిక్ష విధింపుడు" అని పల్కెను. కాపు గడగడ వడఁకుచుఁ గన్నీరుగార్చుచుఁ దడబడునడుగులతో రామదాసస్వామి పాదములపయి వ్రాలి స్వామీ! క్షమింపుడు గడ్డిగఱచితిని. నాబుద్ధినశించినది. ప్రాణదానము గావించుఁడని కంటికి మింటికి నేకధారగ నేడ్చుచుఁ గూలఁబడెను.

ధర్మశాస్త్రజ్ఞులు శిక్షాస్మృతిలోని శ్లోకములుదాహరించి రాజుముం దభియోగఫలితము జేర్చిరి. శివాజి ప్రధానదండనాధికారికై వార్తనంపెను. కాపువాని ప్రాణములు నిలుపునఁబోయినవి. రామదాసస్వామి తన పాదములపయిగల కాపును లేవనెత్తి ఒడలిపయిదుమ్ము కాషాయ వస్త్రముతోఁ దుడిచి కర్షకా! నీ క్షేత్రములు ద్విగుణముగా ఫలించుగాక. నీగృహము ధనధాన్యసమృద్ధిగా నలరారుగాక యని దీవించెను. అనంతరము సమర్థుఁడు శివాజిని జూచి రాజేంద్రా! అపరాధము చేసినది నావిషయమున—కావునఁ దప్పునకుఁ దగిన శిక్ష విధింపవలసినది నేను. నాయాజ్ఞ నిర్వహింపవలసినవాఁడవు నీవు. అది నీ వంగీకరింతువా? యనెను. శివాజి, స్వామినిజూచి గురుదేవా! మీయాజ్ఞకు భిన్నము జరుగునా? మీరొసంగిన శిక్ష మీకనులముందె యాచరింపబడును" అని పల్కెను.

శివాజి చేతులుకట్టుకొని గురుదేవుని యాజ్ఞకొఱకు నిరీక్షించుచుండెను. రామదాసస్వామి రైతుని నోదార్చి శివాజీబాబా! ఏక్షేత్రమునందు నన్నిరైతు కొట్టినాఁడో ఆక్షేత్రమునంతయు రైతునకుఁ బుత్రపౌత్ర పరంపరగ ననుభవించునటుల మాన్యక్షేత్రముగా వ్రాసియిమ్ము. ఇదియే వీనికిఁ దగిన శిక్షయని పలికెను.

జయజయ శ్రీ సమర్థరామదాస.

"కం॥ సురసాలము ఫలపుష్పో
త్కారమునుబర హేతుకముగ దానము సేయున్
నఱకెడువానికి సైతము
దొరికించునుగాదె ఫలము తులసీదాసా."

ప్రత్యేకాంధ్రరాష్ట్రము

కొమాండూరి శఠకోపాచార్యులుగారు ఎం. ఏ., బి. ఎల్

ఇటీవల ప్రత్యేకాంధ్రరాష్ట్రనిర్మాణమును గూర్చి తిరిగి చర్చయు ప్రయత్నమును జరుగుచున్నవి. భాషాప్రయుక్తరాష్ట్రనిర్మాణసూత్రము ఆంధ్రోద్యమమూలముననే ప్రాముఖ్యమునకు వచ్చినను మనవారి కన్న ఓఢ్రులకే ముందుగా ప్రత్యేకరాష్ట్రము నిర్మించుటకు ప్రభుత్వము పూనుకున్నందున ఆసందర్భమున ఆంధ్రదేశపు ఉత్తరసరిహద్దును గూర్చియు తన్మూలముగ మన రాష్ట్రసందర్భమును గూర్చియు చలనము కలిగినది. భాషను బట్టి రాష్ట్రము నిర్మించునప్పుడు సరిహద్దుప్రాంతము ద్విభాషాయుతముగ నుండుటనే అచ్చట తగాదాలు వచ్చుట సహజము. బిహారు ప్రత్యేకరాష్ట్రముగ జేయబడిన 1911 వ సంవత్సరం నుండియు వంగీయు లధికముగా నుండు సింహభూమి జిల్లా మొదలగునవి బీహారులో చేర్చినందులకు అందుల కుభయప్రాంతములవారు తగాదా పడుచున్నారు.

సరిహద్దువిభజన వ్యవహారములలో నెవరికిని పూర్తిగా తృప్తికర మగుట దుస్సాధ్యము. అందుచే గంజాంజిల్లాలోని కొంద రాంధ్రులు ఓఢ్రరాష్ట్రములో జేరిపోవుట తప్పదు. కాని ఆంధ్రజనభూయిష్ట మగు ప్రాంతము లయినను ఆంధ్రప్రాంతముననే వుండునట్లు ప్రయత్నము చేయవలసియుండును. అధికారులు శ్రీమంతు లగు జమీందారుల సలహాలు మాత్రమే వినుట, ప్రజాసామాన్యపు కేకలు వారి చెవులలోనికి జొరకుండుట పరిపాటి అయినది. అందుచే యీసమస్యాపరిష్కారము కేవలము జనసామాన్యపు అభిప్రాయముపయి ఆధారపడునట్లు కనబడదు. నూతనరాష్ట్రము నిర్మించునప్పుడు దాని ఆదాయము సమృద్ధిగా నుండుట అవసరము. అందుకై వీలైనంతవరకు హెచ్చు భూమిని ఆరాష్ట్రపు సరిహద్దులోనికి చేర్చుచుందురు. ఓఢ్రరాష్ట్రము [illegible] నిర్మించుచుచో గంజాంమండలమందలి కొంత ముఖ్యభాగము ఆంధ్రరాష్ట్రమునందే వుంచుట న్యాయము అవశ్యకము అని ప్రభుత్వమునకు బోధపడును. అందుచే ఆంధ్రరాష్ట్రమును వెంటనే ఏర్పాటుచేయు మని కొందరు కోరుచున్నారు. కాని కొందరు సందేహము చెప్పుచున్నారు. ఈ యేప్రియలు నెల ప్రబుద్ధాంధ్రలో "ఇప్పుడు మనకు ప్రత్యేకాంధ్రరాష్ట్రనిర్మాణం అవసరమా" అను శీర్షికతో ప్రచురింపబడిన వ్యాసమున ప్రస్తుతము కొంతకాలమువరకు మనము చెన్నరాష్ట్రములో కలసియే యుండుట మంచి దని ప్రత్యేకరాష్ట్రము మన కిప్పుడు వాంఛనీయము కాదని తుదకు తేల్చబడినది. ఇందుకు వారు తెల్పిన మొదటి కారణము. 'ఆంధ్రుల సంగీతము అరవదేశములో కూలిపోయి' పడివున్నందున యీలోగా ఆ మెను ఆంధ్రదేశమునకు 'శుద్ధస్థితి'లో తెచ్చుకొనవలె నని; రెండవ కారణము తంజావూరు లైబ్రేరీలోని ఆంధ్రగ్రంథములకు మనము ప్రతులను వ్రాసి తెచ్చుకొనవలె నని; కాని మనకు ప్రత్యేకరాష్ట్రము ఏర్పడినంత మాత్రమున గాయకులు గాని లేఖకులు గాని ఒక రాష్ట్రమునుండి రెండవ రాష్ట్రములోనికి వెళ్ళి వెనుకటివలెనే పనులు చూచుకొనుటకు యెట్టి ఆటంకమును కలుగదు. రెండు రాష్ట్రములును ఒక రాజ్యముననే వుండును. బొంబాయి పూనా మొదలగు సలములవలెనే మన రాకపోకలకు గాని ఆదరమునకు గాని ఆటంకము వుండదు. ఆంధ్రరాష్ట్రము వచ్చిన తరువాత కూడ అనేక కార్యములకై దక్షిణదేశమున కొంద రాంధ్రు లుండక మానరు. మరియు ఆంధ్రదేశమున సుమారు మూడులక్షలమంది మాత్రమే వలసవచ్చిన (domiciled) దాక్షిణాత్యులు కలరు గాని ద్రావిడదేశమున ముప్పది లక్షల ఆంధ్రులు చెంగల్పట్టు మొదలు కన్యాకుమారి వద్దనున్న శుచీంద్ర గ్రామమువరకును వ్యాపించి వలసగా నున్నారు. ఆంధ్రరాష్ట్రము యేర్పడినను వీరిని [illegible] ద్యోగసమస్య తీవ్రముగా నున్న యీరోజులలో వారి నందరిని ఇక్కడకు తెచ్చుకొనుట మనకును సుఖకరము కాదు. అన్నిటికన్న ముఖ్య మైనది ఆంధ్రులు విస్మరించిన తమ పూర్వుల సచ్చారిత్రము సుగుణసంపత్తి తిరిగి అలవరచుకొనుటకై చెన్నరాష్ట్రముననే మన ముండవలె నని వ్రాయుచు తిరిగి ఆంధ్రులకు ప్రజ్ఞ సామర్థ్యము ఔదార్యము నాయకత్వము—వీటికి లోటు లే దని శ్రీకృష్ణారావుగారే యీవ్యాసమున వ్రాసిరి. ఆశక్తి సంపదను యితర విధముల వినియోగించుచున్నా మని అట్లుగాక మన ప్రత్యేకోపయోగమునకై వినియోగించవలెనని వారు తెల్పిరి. అందుకు రాష్ట్రనిర్మాణము నిల్పించుటకన్న వెంటనే రాష్ట్రనిర్మాణము చేయుటయే యావశ్యకము. ప్రత్యేకరాష్ట్రనిర్మాణము కాగానే మన శక్తిని ముందుగా మన కార్యములకే వినియోగింతుము. ప్రస్తుతద్వంద్వప్రభుత్వమును జయప్రదముగ నడిపించి మద్రాసు రాజ్యాధికారము తమ చేతనుంచుకొని రని కృష్ణారావుగారు చెప్పిన యాంగ్లాధికారులు తమ యాంధ్రప్రాంతమునకు సిర మగు

నుపకారమేమియు నింతవరకును చేయలేరైరి. కొందరున్నతోద్యోగులగుట వారికి మాత్రమే లాభకరమగుచున్నది కాని వారు ప్రజాసామాన్యమున కుపకారము చేయగల్గుట లేదు. ప్రత్యేకరాష్ట్రమును నిలిపియుంచుటకు నిజమగు కారణము పశ్చిమాంధ్రులు ఆంధ్రరాష్ట్రమునకు ఆంధ్రవిశ్వవిద్యాలయమునకు విముఖులుగానున్నారని వారిని కూడా మినహాయించుచో మిగిలిన వుత్తరసర్కారులు మాత్రము ప్రత్యేకరాష్ట్రముగా నేర్పడుటకు వీలుండదు. అను నిరాశచే పశ్చిమాంధ్రుల బుద్ధి మారువరకు ప్రస్తుతము మనకు రాష్ట్ర మవసరము లేదని నిజభావము వారివ్యాసమున గోచరించుచున్నది. పశ్చిమాంధ్రుల సద్భావము పోవుటకు కారణములు తెలుసుకొనుట యావశ్యకము. విశ్వవిద్యాలయ కార్యస్థానము బెజవాడనుండి విశాఖపట్టణమునకు మార్చుట పశ్చిమాంధ్రుల విముఖతకు కారణ మని శ్రీకృష్ణారావుగారా వ్యాసముననే వ్రాసిరి. పశ్చిమాంధ్రులలోను నెల్లూరివారిలోను చాలామందికి బెజవాడకన్న మద్రాసే అనేకవిధముల ఎక్కువ సదుపాయముగ నున్నను బెజవాడ కార్యస్థానముగా నుండుచో ఆంధ్రవిశ్వవిద్యాలయమునను రాష్ట్రమునను ఉంచుట కంగీకారమే యనియు అంతకన్న దూరముగ విశాఖపట్టణమున పెట్టుటచే ఇంకను రెండువందల మైళ్లు పైగా దూరమగుటచేత తమ కంతమాత్రము వీలుండ దని పశ్చిమాంధ్రులు తెలుపుచున్నారు. ఇందు అసత్య మేమియు కనబడదు. పశ్చిమాంధ్రజిల్లాలలోనే కార్యస్థాన ముండవలె నని వా రనుటలేదు. బెజవాడ వున్న కృష్ణాజిల్లాకు దక్షిణ పశ్చిమములందు ఆరు ఆంధ్రజిల్లాలును వుత్తరమున మూడు నాలుగు జిల్లాలు మాత్రమును ఉండు ననియు బెజవాడ తక్కిన నగరములకన్న వేగముగ వృద్ధి యగుచున్న దనియు వ్యాపారాభివృద్ధి కల దనియు మంచి రైల్వే సౌకర్యములు కల దనియు బెజవాడ ఆంధ్రజిల్లా లన్నిటికిని నిజాం ఆంధ్రులకును గూడ మధ్యగనుండి సదుపాయముగ నుండు నని పశ్చిమాంధ్రులు తెలుపుచున్నారు. పశ్చిమాంధ్రప్రదేశము ఊషరక్షేత్రము రాతినేల యని తమ వ్యాసమున వ్రాసిన శ్రీకృష్ణారావుగారికి పశ్చిమాంధ్రులు మనకన్న గూడ చాలా బీదస్థితిలో నున్నందున వారి యభివృద్ధికి మనము సహాయము చేయుట మన ధర్మ మని తెలిసియే యున్నది. ఆంధ్రు లందరు ఏకాభిప్రాయు లైనచో కార్యస్థానము విశాఖపట్టణమునుండి తిరిగి మార్చుట దుస్సాధ్యము కాదు. కార్యస్థాన మనుకూలముగా నుండుచో పశ్చిమాంధ్రులు విముఖులుగా నుండరు. పశ్చిమాంధ్రు లాంధ్రోద్యమమునకే విముఖు లని తలచుట పొరపాటు. పశ్చిమాంధ్రుల మొర విని వారిని సంతృప్తుల జేయుటచేతనే ఐకమత్యము కార్యసాధనము కలుగును. శ్రీకృష్ణారావుగారు తమ వ్యాసమున అనుమానము, అసూయ, మాత్సర్యము పశ్చిమాంధ్రుల నావహించియున్న వని అవి వారి కుగ్గుపాలతో వచ్చిన సహజగుణములని మొదలగు సంగతులు నిందాపూరితముగ పలుతావుల వ్రాయుట యెంతయు విచారకరము. విద్వాంసులు యిట్లు వ్రాయుచుండుటచే సోదరసంఘముల మధ్య మరింత విముఖత విరోధభావము హెచ్చు అయి ఆంధ్రోద్యమమునకును ఆంధ్రజాతికిని అందుచే చాల అపకారము కలుగుచున్నది. ఒక సంఘము నంతను అసూయా మాత్సర్యాదిపరు లని నిందించుట యెన్నటికిని మంచిది కాదు. మన సోదరసంఘము నట్లనుట మరియు హానికరము. మరియు శ్రీకృష్ణారావుగారు కాంగ్రెసువలన ఆంధ్రోద్యమమునకు హాని కలుగుచున్న దని సూచించు "కాంగ్రెసు వెల్లువలో మునిగిపోయిన ఆంధ్రునికి నిజమైన దేశాభిమానం లేదు" అని కూడ రాజకీయవిషయములకు తావొసగని ప్రబుద్ధాంధ్రలో వ్రాయుట యెంతయు శోచనీయము. కాంగ్రెసు దేశభాషలందే సభాకార్యముల జరిగించుచుండుటయు ప్రజలలో దేశభాషలందాసక్తిని కలిగించుటయు భాషాప్రయుక్తరాష్ట్ర

పద్ధతిని ముందుగా నంగీకరించుటయే గాక కాంగ్రెసు ప్రాంతీయభాగముల భాషాప్రయుక్తములుగానే యేర్పఱచుకొనుటయు కాంగ్రెసు ఆంధ్రోద్యమమునకు సహకారియే అనుటకు నిదర్శనములు.

(ఈసంచికలో యిలాంటిదే యింకో వ్యాసం ప్రకటించబడింది. ఇలాగ సర్కారులవారే యిద్దరు విద్వాంసులు శ్రీకృష్ణారావుపంతులుగారికి జవాబు చెప్పడం బాగానే వుంది. అందులోనూ రాయలసీమవారు మనయెడల అనుమానగ్రస్తులై వుండడానికి మన నడవడికే కారణ మని శఠకోపాచార్యులుగారు వొప్పుకోడం మరీ బాగుంది. అయితే యింత మాత్రాన రాయలసీమవారికి సంతృప్తీ, ఆది కలగనంత సేపూ ఆంధ్రవికాసమూ సాధ్యపడవు.

కృష్ణారావుపంతులుగారు రాయలసీమవారిని యేమిటేమిటో విశేషణాలతో నిందించారంటే దానికి బాధ్యులు వారే; అయితే. రాయలసీమవారిని మేమలా భావించడం లేదు. రాయలసీమ అంటే ఆంధ్రదేశానికి గుండెకాయ. అది నేడు నీటివసతులు లేకా ఐశ్వర్యం లేకా నికృష్ణస్థితిలో వుండటం ఆంధ్రజాతికి తీవ్ర మైన గుండెజబ్బు వుందన్న మాట. సర్కారుల మెత్తని మట్టిలో విశిష్టత వుంటే మరి ఆజబ్బు కుదర్చడానికి ప్రయత్నించదేం?

నిజం చెప్పవలసివస్తే అసలు జబ్బు సర్కారులలోనే వుంది. హద్దు లేని అహమిక, ముందూ వెనకా తెలవని దుడుకుతనం, ప్రతిఘటనలు వస్తే గభుక్కున చప్పబడిపోవడం, తన సంగతి విడిచిపెట్టి పరాయివాడి వెనక్కాల పరిగెత్తడం, వచ్చిన గాలికల్లా యెగిరిపోవడం,—వొక టేమిటి యిలాంటి లోపాలనేకాలు సర్కారులలోనే వున్నాయి. "రాయలసీమవారు అసూయాగ్రస్తులై వున్నారు కనక ఆంధ్రరాష్ట్రం యిప్పుడు మనకి వద్దు" సరే. బాగానె వుంది. అయితే ఆవైపున ఓఢ్రులు పెద్ద తెనుగుగడ్డని సాయంపట్టేస్తున్నారే? ఏదీ సర్కారులవారి ప్రతిఘటనం?

ఇంతకీ: కృష్ణారావుగారి వ్యాసంవల్ల రాయలసీమవారికి మనమీద కొత్తగా కలిగే ద్వేషం యేమీ లేదు. అది యిదివరకే కావలసినంత వుంది. వారి క నదులు యెన్ని వచ్చిపడ్డా సముద్రానికి వుల్బణం కలగదు. కాని ఆంధ్రరాష్ట్రం కావాలనే సర్కారులవారికి రాయలసీమవారిని కూడగట్టుకోవాలనే జ్ఞానం లేదు. ఈస్థితిలో మేము ప్రకటించిన కృష్ణారావుగారి వ్యాసం రాయలసీమవారి ద్వేషాన్ని పెంపుచేస్తుందనుకోడం కంటే సర్కారుల ప్రముఖులకు కర్తవ్యపాలనం విషయంలో కశాఘాతంగా వుపచరిస్తుందని అనుకోవడం మంచిది.

ఇంకొక్క సంగతి. ఎలాంటి హేమాహేమీలు వచ్చి బుజ్జగించినా రాయలసీమవారు ఆంధ్రవిశ్వకళాపరిషత్తు విశాఖపట్టణంలో వుండిపోడానికి అంగీకరించకుండా వుంటారనే మేము నమ్ముతున్నాం. శాశ్వతాలూ మహోన్నతాలూ అయిన యిలాంటి సంస్థల విషయంలో స్థానికాభిమానం చాలా అపాయకర మైనది. ఇవాళ విశాపట్టణం ఆంధ్రవిశ్వకళాపరిషత్తుకు ప్రధానస్థానంగా వుండడానికి చల్లగా వుండడమూ, హార్బరు వుండడమూ ముఖ్యకారణా లయితే రేపొద్దున్న ఆంధ్రరాష్ట్రప్రధానస్థలం కావడానికి మాత్రం అవి కారణాలు కాకపోతాయా! ఏమయినా ఈవిషయంలో రాయలసీమవారి పట్టుదల ముందుముందు ఆంధ్రదేశానికంతటికీ లాభకరంగా వుంటుంది. పైగా శఠకోపాచార్యులుగారు గూడా ఆంధ్రవిశ్వకళాపరిషత్తును బెజవాడకు మార్చాలనే చెబుతున్నారు. ఇది చాలా దూరదృష్టిని సూచిస్తోంది. దీన్ని మనం నెరవేర్చగలిగితే ఆక్షణంలో ఆంధ్రరాష్ట్రం నిర్మింపబడిందన్న మాట. సంపాదకుడు)

ఆవుబేరం

వజ్ఝల వేంకటేశ్వరకవిగారు బి. ఏ

"నేను మొదట్నుంచీ వద్దంటూనే ఉన్నాను. అయితే నామాట కొనిచ్చేరూ? ఒకటే పోరు ఇంట్లో అందరూనూ! నాప్రాణాలు పీకేశేరు కదూ ఆవును కొనిదాకా! ఒకటా రెండా? ముప్ఫైరూపాయలు చేజేతులా నాచేత ఇప్పించేశేరు. ఎలాగైతేం కొన్నాం ఆవుని! అనుభవించండి సాడి!" అంటూ ఇంట్లో అందరి మీదా ఉగ్రుడై పోతున్నాడు మా అన్నయ్య. కోపం వచ్చిందంటే అతని ధాటికి ఎవరూ ఆగలేరు. కాని అతనిది ప్రథమకోపం. తాటాకు మంటలాగ అప్పుడే చల్లారిపోతుంది. జవాబు చెప్పడం మానవప్రకృతి సహజం కాబట్టి మా వదినె గారు ఊరుకోలేదు.

"అయితే యెందుకందరి మీదా అలా కేకలేస్తారూ? మీరు ఆవుని చూడడ మేమిటి, కొనుక్కొని యింటికి తేవడ మేమిటి, మమ్మల్ని అనడ మేమిటి?"

"ఒసే ఊరుకుందూ! పిల్లడికి తులం బంగారం కొని ఒత్తులు చేయిస్తా నంటే విన్నా? ఒకటే పోరు పెట్టేవు ఆవో ఆవో అని, పాలూ పెరుగూ అనుభవించవచ్చునని. కష్టపడి మిగిల్చిన 30 రూపాయలూ బూడిదలో పోయించేవు!"

"నాయనా! దాన్నెందు కంటావు?" అని అందుకుంది మా అమ్మ.

"ఆవు నంటే కొనమన్నాం గాని యిలాంటి ఆవంటే మేం మాత్రం ఇష్టపడతామా? పెద్దవరస ఆవు, పూటకు రెండుశేర్లపాలు నిరాఘాటంగా యిస్తుంది అంటూ నువ్వూ రుద్రాభట్లుగారూ పొగిడితే మేం కొనమన్నాం. ఆ మాత్రం ఆవుని కొన్నప్పుడు నువ్వు చూచుకోవద్దూ?"

"ఊరుకుందూ అమ్మా! దాన్ని వెనకేసు కొస్తున్నావు! అంతా వొక్కలాటి వెధవలే! నేను ఏజన్మలోనైనా ఆవుని కొన్నానా? చూశానా? ఆవుబేరం చెయ్యడానికి మీరు నన్ను పంపడమేమిటి లేకపోతే? ఆరుద్రాభట్లు గారికే తెలియకుంటే నాకేం తెలుస్తుంది?"

"నాయనా! అయితే ముక్కుకు కన్నం పొడిచి తాడుదూర్చి మూతికి కట్టేడుగదా, అదినువ్వు చూడకపోయేవా? ఆసంగతి మాతో చెబితే మేం వెంటనే చెబుదుము, అది పొడుపులగొడ్డూ, తాపులగొడ్డూ, కొనవద్దని. నీలో తప్పు పెట్టుకొని మమ్మల్నందుకూ అనడం?"

"మహాప్రభో, నాకు స్కూలుకెళ్ళి పాఠం చెప్పడం తప్ప మరేమీ తెలియదని మొదటే మనవిచేసుకుంటే మళ్ళీ నాది తప్పంటా వేమిటి? నాకు ఆవు నాడెంలో అనుభవం లేదని నీకు చెప్పలేదూ? పొదుగు గుల్లగా ఉందో లేదో పాలు ఎన్నిస్తుందో చూడమన్నావు. అవి సరిగ్గా చూశేను. అనుకూలంగా ఉన్నాయి. ముక్కులో తాడుంటే వొద్దని చెప్పలేకపోయేవా? పోనీ నాకు జ్ఞానం లేకపోతే ఆరుద్రాభట్లు చెప్పొద్దూ?"

అంటూ మా అన్నయ్య పళ్ళు కొరుకుతూ విజృంభించేడు. నేను ఈఘుర్షణ అంతా వింటూ పక్కమీద పడుక్కొని (నాకు రెండు రోజుల్నించీ జ్వరం) నాలో నేను నవ్వుకుంటున్నాను. నేను వెళ్ళి ఉంటే కొంత జాగ్రత్తగా పరిశీలించి ఉందునేమో! "పెద్ద సైన్సు మాస్టరుగదా, ఈపాటి పరిశీలన లేక పోయిందా, మా అన్నయ్యకి; ఆవుకి ముక్కులో తాడూ, మూతినిండా కట్లూ ఏమిటి? అని తోచలేదా?". అని మనస్సులో అనుకున్నాను. పైకి అనలేను సుమండీ! అంటే వృందాపురి? అగ్గిమీద గుగ్గిలం జల్లినట్లు కాదూ?

మా అన్నయ్య కోపానికీ, ఆవుని కొనడానికీ, మా అమ్మా వాళ్లూ కొంచెం నవ్వడం ప్రారంభించేరు. దానిమీద అతనికోపం మరింత మండింది.

"నా చేత డబ్బు తగలెట్టించి తిరిగీ నవ్వుకూడానూ సిగ్గులేని మొగాలికి! వీధులో అందరికీ ఆవు

ఉంటే మన కెందుక్కూడదూ? మేష్టర్లందరికీ ఆవు ఉంటే మనకెందుకు లేకపోవాలి? మొదట్నుంచీ యిలాగేకదూ విముఖత్వం చూపేనన్ను ఆవు బేరం లోకి దింపేరు? నెల్లాళ్లయింది ఒకటే గోల! "ఆవు" అన్నపదం నాచెవిలో ప్రతిధ్వనించని క్షణంలేదు! పోతేపోవు గాక నెలకు పదిహేను రూపాయలు! కడుపుల్లో చల్ల కదలకుండా ఆగౌడుది రోజూ రెండుశేర్లపాలూ ఇచ్చి పోతూవుండేది. నెలకూ యింత ఖర్చేమిటి? ఈ కరువుకాలంలో పొందికె చెయ్యాలని ఒకయూల మాత్రమ్మ్రడు! ఆవుకి నెలకీ ఎంతబాగా మేపు పెట్టినా ఎనిమిది రూపాయలకు మించదుకదా, నాలుగైదు నెల్లలో ఆవుసొమ్ము వచ్చేస్తుంది. పైగా ఇంటినిండా పాలూ, పెరుగూ నెయ్యీ, ఆవు మిగులు, ఇలాగే కిమ్మతులు చెప్పి నచ్చజెప్పేరు. వాళ్లమాటలు విని నేనూ బాగుంది అనుకున్నాను. అప్పటికీ అద్దిళ్లలో మారుతూ వుండే మనకు ఆవుని కట్టుగోడానికి సాల యేదీ అనికూడా అడ్డు చెప్పేను. ఏం లాభం? అరుద్రాభట్లు ఊరుకున్నాడూ? సాల యిస్తా నన్నాడు. కనబడ్డప్పుడల్లా ఒకటేబోధ: నామాట విని ఆవుని కొనండి. పెద్దజీతగాళ్ళు మీలాటివాళ్లు వెనక తీస్తారేమిటండీ? మీరేం ఆవుకి మేత పెట్టలేరా? పైగా మీకు ఆవుని పెంచడం అనేది మహాపుణ్యం. ఆలోచించుకోండి!—అని. ఇందరు మంది పట్టుపడితే ఒక్కణ్ణి నే నేమిచెయ్యగలను? వాళ్లు చెప్పినవన్నీ నాకు రైటుగా తోచేయి. ఆవు కొనడానికి నిశ్చయించేను. ఇంతట్లో ఆవులు ప్రపంచకంలో ఎక్కడా లేనట్లు నాపాలిటి శనిలాగ "భేషైన ఆవు. ఆలోచిస్తే మించిపోతుంది" అంటూ మా అమ్మ వార్త తెచ్చింది. రుద్రాభట్లుగారు ఆవునిచూచి బాగుందన్నారు. కడవరికి ఆవెధవ పొడుపుల గొడ్డుని అందరూ కలిసి నాచేత కొనిపించేరు. వాళ్ళకేం పోవాలి? డబ్బు ఖర్చుపెట్టింది. నేనూ!" అంటూ లెక్చరు ఆరంభించేడు మా అన్నయ్య.

"ఆవుని కొన్నప్పుడు నాయనా ఒంటిమీద ఒకమారు చెయ్యైనా వేసి చూశేవుకావా?" అంది మా అమ్మ ఊరుకోక.

"ఊరుకుందూ అమ్మా! ఇప్పు డన్నీ అడుగుతావు! అప్పుడేమైంది నీ బుద్ధి? ఆరుద్రాభట్లు మాత్రం ఆవు వొంటిమీద చెయ్యి వేశాడా యేమిటి? ఆవుకు రెండుగజాలమేరలో ఇద్దరం నిల్చున్నాం. ఆవుని ఒక యిరుకుసందులో కట్టేడు కదలలేకుండా! ఎదురుగా సాలరాట. ఒకమనిషి వాడు మూతి తాళ్లు పట్టుకుంటే ఇంకోకడు కాళ్లకి బంధంవేసి బ్రహ్మాండంమీద తీశేడు శేరుపాలు. నాదృష్టి వెధవపాలమీదనే ఉంది కాని ఇవన్నీ అపుడు పరిశీలించలేదు. ఒకొక్కటే ఇపుడు బోధపడుతున్నాది వాడు చేసిన దగా. శేరుపాలకీ మన మిష్టపడ్డాంగదూ? తిండి బాగా పెడితే శేరున్నరా, రెండుశేర్లూ కూడా యిస్తుం దనుకున్నాం. ఏమైతే నేం? మోసం జరిగింది. నావి కదా రూపాయలు పోయేయి? మీకేంబాధ?"

"నాయనా! మాకు మాత్రం అక్కర్లేదూ? నీదైతే మాదికాదూ? ఏదో కొంచెం కొత్తవాళ్లవడంచేత బెదురుతుందంటే ఆవునుకాబోలు అనుకున్నాంగాని ముక్కుతాళ్ల పొడుపుల గొడ్డనీ, ఇంత పెంకెజంతువనీ కల్లోనైనా మే మూహించలేదు. పోనీ ఇంటికి తెచ్చేక మావాళ్లకి చూపించి డబ్బిస్తా ననలేకపోయేవా?"

"అమ్మా! యెందు కింకా నన్ను ప్రశ్నలు వెయ్యడం! డబ్బిస్తేనేకాని ఆవుని తోలుకురానన్నాడు ఆగాడిదకొడుకు. రుద్రాభట్లు సలహాపుచ్చుకుని డబ్బిచ్చేశేను. ఏదో గతజలసేతుబంధనం. ఆట్టే పెంచక ఊరుకుంటే మేలు"

ఈవిధంగా ఆవునికొన్న మరునాటి సాయంత్రం మాయింట్లో సంభాషణ సాగింది. తొలినాడు ఆవుని రెండుపూట్లా చూడడం, సాయంత్రం యింటికి తోలించుకురావడం, మర్నాడుదయం పాలు తీసే

టప్పటి పాట్లు అనుభవించడం, ఆయిన మీదట జరిగిన ప్రసంగం అది. సాయంకాలం ఆరుగంట లైంది.

"అమ్మా!" అని పిలుపు. పాలవాడొచ్చి పాలు తియ్యడానికి పిలుస్తున్నాడు.

"ఇంక ఉందిగా బాబూ ఆవుతో యుద్ధం. దిక్కుమాలినగోల రూపాయలు నష్టించడం గాకుండా, పైగా ఆవుకి చాకిరీ. రెండుపూట్లా పాలు తీసేటప్పుడు ఘోరమైన క్షోభ. ఇంతా చేస్తే పాలిస్తుందో యివ్వదో అని బెంగ. ఎందు కొచ్చిన బాధరా దేవుడా!" అంటూ విసుక్కుంటూ లేచేడు మా అన్నయ్య. పాలు తియ్యడం అనే తమాషా చూడడానికి అందరూ బైల్దేరేరు. ఆవేళ జ్వరం తగ్గడం వల్ల నేనూ లేచేను. అందరం సాల చేరుకున్నాం. సాల కొంచెం పురాతనమైనది. ఒక రాటకి ఆవు కట్టబడి వుంది. మేం వెళ్ళేసరికి సింహంలాగ బుర్ర యెత్తి చూడడం మొదలెట్టింది. పాములాగ బుస్సుమంది. పెయ్యని వదిలేరు. పాలవాడు ఎలాగైతేనేం మెల్లిగా దగ్గిరికెళ్ళేడు. ఒకడు ధైర్యంచేసి ముక్కుతాడు రెండు చేతుల్తోని పట్టుకున్నాడు. ఆవు బుర్ర తిప్పుతునే వుంది. పాలవాడు కాళ్ళకి బంధం వేదామని తాడు విసిరేసరికి ఫెడీమని తన్ని ఒక్కమాటు బుర్ర తిప్పి రాటచుట్టూ గిరగిరా తిరగడం ప్రారంభించింది. పాలవాడు వెనక్కి పడ్డాడు. రెండో వాడి చేతుల్లో ముక్కుతాడు టఫీమని తెగింది. ఇద్దరూ తప్పించుకుని పైకి వచ్చేసేరు. కొంతసేపటికి ఆవు నిల్చుంది. పెయ్యి పాలు కుడుస్తూంది. మళ్ళీ పాలు తియ్యడానికి ప్రయత్నం. మేం కాస్త దూరంగా నిల్చుని ప్రేక్షకులమై నాటకాన్ని చూస్తున్నాం. ఈసారి ఏమైందనుకున్నారు? ముక్కుతాడు తెగి స్వేచ్ఛలాభమైంది కాబోలు తిరిగి తిరిగి ఆవు ఒక్కసారియెగురు ఎగిరింది. దాంతో కూడా రాట మొదటికి విరిగింది, దభీమని సాల కూలి పడింది. ఆవూ, పాలవాడూ, లోపల చిక్కడ్డారు. ఎలాగైతేనేం పాలవాడు ఆలిసిపోయి, ప్రాణాల బిగబట్టుకుని పైకి ఊడిపడ్డాడు. యుజం చేసినంత అయింది. రెండోపూట పాలు తీయడం ఈవిధంగ జరిగింది. సొమ్ము నష్టం; పాలా శూన్యం; యథాప్రకారం పాలు కొనడం తప్పింది కాదు. ఆవు నిప్పుడేం చెయ్యడం? పోషించకపోతే తిండి లేక చస్తుంది. పుణ్యానికి బదులు గోహత్యపాపం ఒడి గట్టుకోవాలి.

"ఎవడికేనా బ్రాహ్మడికి సివేత దానం యిప్పించేస్తే ఈ ఆవు వదిలిపోతుంది" అన్నాడు మా అన్నయ్య అమ్మతో. అయితే ఆవుసంగతి విన్నవాడయితే ఎవడు దానం మాత్రం పడతాడు?

కాబట్టి పాఠకులు ఒక సంగతి గమనించాలి. సాధ్యమైనంతవరకూ ఆవుని కొనకుండా కాలక్షేపం చెయ్యడం ఉత్తమం. అంతగా కొనడం తప్పకపోతే జాగ్రత్తగా పరిశీలించి ముక్కులో తాడులేని ఆవుని చూచి కొనుక్కోవాలి. లేకపోతే మాలాగే బాధపడవలసొస్తుంది.

కవులకూ, వ్యాసకర్తలకూ విన్నపం

ప్రబుద్ధాంధ్రకు ఎవరూ పద్యాలు పంపవద్దు. ఆంధ్రోద్యమమూ, చరిత్రా, సంఘాచారాలూ, మతాలూ వగైరాలను గురించిన వ్యాసాలూ, ఏకాంక నాటకాలూ, కథలూ విమర్శలూ మొదలయినవి వచనంలోనే కావాలి. ప్రకటించని రచనలు పోస్టుబిళ్లలు పంపినగాని తిరిగి పంపబడవు. కర్తలకు వారి రచన పడిన సంచిక మొదలు ౧౨ సంచికలు పంపుతాము. తరుచు రాసేవారికి ఎప్పుడూ పంపుతాము. ఇంతే మేము చెయ్యగల సత్కారం.

ఇట్లు వ్యవస్థాపకుడు.

శ్రీ వ్యాసరాజస్వామి జీవితము

మారేమండ రామారావుగారు ఎం, ఏ., బి. ఇడి

ఈతడు ద్వైతమతగురువులలో నగ్రగణ్యుడు. ఈతనిజీవితము కేవలమును ద్వైతమత చరిత్రమునకే గాక విజయనగరసామ్రాజ్యచరిత్రమునకును, దక్షిణహిందూదేశ మతవాఙ్మయచరిత్రమునకు గూడ మిగుల ముఖ్యమైనది. 15 వ శతాబ్ది యుత్తరార్థము మొదలు 16 వ శతాబ్ది ప్రథమపాదాంత్యము వరకును గల దక్షిణదేశచరిత్రమునందలి కొన్నిఘట్టముల నవగాహన మొనర్చుకొనుట కీవ్యాసరాజస్వామి జీవితము విశేషముగ దోడ్పడుచున్నది.

ఈమహాపురుషుని జీవితమును దెలిసికొనుటకు సోమనాథుడను కవిచే రచింపఁబడిన "వ్యాసయోగిచరితం" అను సంస్కృతకావ్యము ముఖ్యసాధనము. ఇదిగాక వ్యాసవిజయం, బ్రహ్మణ్యతీర్థవిజయం, అను సంస్కృతగ్రంథములును, న్యూనిజ్ అను పోర్చుగీసుచరిత్రకారుని వ్రాతలును, పెక్కుశాసనములును గూడ వ్యాసరాజస్వామిజీవితమును దెలిసికొనుట కుపయోగించుచున్నవి. ఇందు సోమనాథకవి వ్యాసరాజస్వామికి శిష్యుడై, విజయనగరములో అయనవద్దనే పెక్కుసంవత్సరము లుండి ఆయనజీవితచరిత్రము నొకకావ్యముగా రచించిసమర్పించి ఆయనచే మిక్కిలి గౌరవింపబడెను. అటులే వ్యాసవిజయమును రచించిన శ్రీనివాసతీర్థులును వ్యాసరాజస్వామికి మేనల్లుడును శిష్యుడునై యుండెను.

ఈయతివర్యుని తల్లిదండ్రులను గూర్చియు, జననమునుగూర్చియు అభిప్రాయభేదములు గలవు. స్తోత్రమహోదధిలోని యొకశ్లోకమునుండి యీయన రామాచార్యులను నతనికి బ్రహ్మణ్యతీర్థస్వామి కృపవలన ప్రభవసంవత్సర వైశాఖశుద్ధ సప్తమి ఆదివారమునాడు జన్మించెనని తెలియుచున్నది. ఈకాలము క్రీ. శ. 1447 సంవత్సరము ఏప్రిల్ 22 తేదీకి సరియగుచున్నది. సోమనాథకవి గ్రంథములో వ్యాసరాజస్వామితండ్రి కాశ్యపగోత్రుడైన బల్లణను మతియునియు నతనికి మొదటిభార్యయందు సంతానము కలుగకుండుటచే అక్కాంబికయను నామెను పెండ్లాడెననియు నామెవలన భీమక్కయనుకూతురును మధ్వ యతిరాజ అను పుత్రులను బడసెననియు చెప్పబడియున్నది. వ్యాసవిజయమున మాత్రము పైబల్లణసుమతి చనిపోగా బ్రహ్మణ్యతీర్థస్వామి యతనిని బ్రతికించెననియు వారిలో యతిరాజు మొదటివాడనియు గలదు. పిమ్మట నతనితండ్రి యతిరాజును బ్రహ్మణ్యతీర్థుల కిచ్చివేసెదనని వాగ్దానము చేసెనట. ఈబాలునికి 16వ సంవత్సరమువచ్చినపిమ్మట నతనిని పూర్వముచేసిన వాగ్దానముప్రకారము తమ వద్దకు బంపుడని బ్రహ్మణ్యతీర్థులు శిష్యులనుబంపిరి. అంతట యతిరాజు తల్లిదండ్రులు అతనిని వెంటబెట్టుకొని మఠమునకేగి యీబాలుని గురువునకు సమర్పించిరి. అచ్చట నతడు విద్యాభ్యాసము చేయుచు విశేషమగు ప్రతిభను, అద్వితీయమగు వైరాగ్యమును కనబఱచెను. దీనినిచూచి గురువు తనయనంతరము పీఠమునకు రాదగినవాడు ఈశిష్యుడేయనియు, నాతనిపాండిత్య ప్రతిభచే ద్వైతమతము ప్రబలగలదనియు నూహించుకొని, యతనికి ఆశ్రమము నొసంగెను. క్రీ. శ. 1467 లో బ్రహ్మణ్యతీర్థులు మరణింపగా యతిరాజు వ్యాసతీర్థులను పేరుతో పీఠాధిపత్యమునకు వచ్చెను.

ఇప్పటి కీయనకు వయస్సు 20 సంవత్సరములే యైన నీయన విజ్ఞానమును పాండిత్యమును అద్వితీయములై యుండినవి. త్వరలోనే ఈస్వాములవారు దేశాటనమునకు బయలుదేఱిరి. క్రీ. శ. 1467 లో వీరు కాంచీపురమున నెందఱినో ప్రతిపక్షులను వాదములలో నోడించిరి. అటుపై నితరస్థలములలో వీరు సంచారము చేయుచుండగా వీరి విద్యాగురువులగు శ్రీపాద రాయలవారిని విజయనగరరాజగు సాళువనరసింహుడు తన సింహాసనమున గూర్చుండబెట్టి తనభక్తిని వెల్లడించెను.

క్రీ. శ. 1471–74 నడుమ వ్యాసరాజస్వామి ఉత్తర హిందూదేశమున సంచరించెను. ఇంతకుపూర్వమే బంగాళాదేశమున జయధ్వజాచార్యుడు ద్వైతమతమును వ్యాపింపజేసెను. అందువలన వ్యాసరాజస్వామికెందరో శిష్యులాప్రాంతమున పూజలొనర్చిరి. అట్టివారిలో నొకబ్రాహ్మణుడు స్వాములవారిచే సన్యాసమును స్వీకరించెను. 1475 లో వ్యాసరాజస్వామి ముల్‌బాగల్ అనుగ్రామము ను జేరిరి. శ్రీపాద రాయ లను యతి యచ్చట నెందరికో విద్యోపదేశము జేయుచుండెను. ఇట గొంతకాలము గడపినపిమ్మట శ్రీపాదరాయలు "నీవు మహాకార్యముల నెన్నిటినో చేయవలసియున్నది. సాళువనరసింహుడు చంద్రగిరిపట్టణమున నున్నాడు. అతడు నిన్ను మిక్కిలి సన్మానింపగలడు. గాన నీవు తిరుపతికి పొ"మ్మని యాజ్ఞాపించెను. అంతట 1476 లో వ్యాసరాజస్వామి తిరుపతికి పోయెను. కొంతకాలమునకు పిమ్మట నచటి వేంకటేశ్వరాలయములోని యర్చకులందరును కుట్రచేసి దేవునియాభరణములను దొంగిలించిరి. ఈవార్త రాజగు నరసింహరాయలకు దెలిసి యతడు ధర్మశాస్త్రము ననుసరించి యా దేవస్వాపహర్తలకు మరణదండనను విధించెను. కాని యందుమూలమున దేవుని నిత్యపూజాదికములకు చిక్కువచ్చెను. అంతట రాయలు తిరుమలపై తపస్సుచేసికొనుచుండి, యప్పటికే విశేష విఖ్యాతిగాంచిన వ్యాసరాజస్వామివద్ద కేతెంచి తన్ననుగ్రహించి దేవకార్యమునకు విఘ్నముగాకుండజేయుడని భక్తిపూర్వకముగ బ్రార్థించెను. స్వామియు గుర్వాజ్ఞనుదలంచుకొని యందుల కంగీకరించెను. అంతటినుండియు నిస్వామి పండ్రెండు సంవత్సరముల కాల మీస్థలముననే యుండి శ్రీమధ్వాచార్యులవారు నిర్ణయించిన తంత్రసారము ననుసరించి దేవుని పూజావిధానమును నిర్వర్తించుచుండిరి. పూర్వము శిక్షింపబడిన యర్చకులలో నొకని భార్య భర్త మరణించునాటికి గర్భవతిగ నుండి పిమ్మట నొకపుత్రుని గనెను. అతనికి పండ్రెండవ సంవత్సరము వచ్చినపిమ్మట వ్యాసరాజస్వామి యతనిని తిరిగి యర్చకత్వమున నెలకొల్పి తిరుపతినివీడి తిరిగీ సంచారమునకై యేగెను.

ఈలోగా విజయనగరరాజ్యము నందెన్నియో మార్పులు గల్గినవి. సాళువవంశజులను బారదోలి తుళువ వీరనరసింహరాయలు సింహాసనమునకు వచ్చెను. అప్పటికి వ్యాసరాజస్వామి పాండితీవిభవమును, తపశ్శక్తియు దేశమంతటను వ్యాపించినవి. క్రీ. శ. 1498 లో రాయలు తనమంత్రులను బంపి స్వామిని తనరాజధానికేతెంచి తన్ననుగ్రహింప బ్రార్థించెను. వ్యాసరాజస్వామియు నందుల కంగీకరించెను. ఈయతివర్యు డింకను గొంతదూరమున నుండగనే రాయలు మంత్రిసామంతులతోను, పరివారముతోను, సైన్యముతోడను నెదురేగి, యతని నేనుగుపై నెక్కించి పాదచారియై యనుసరించి విజయనగరమును బ్రవేశింపజేసెను. పిమ్మట వ్యాసరాజస్వామి నొకహర్మ్యమున విడియజేసి భక్తిపూర్వకముగ బూజించి, యాతనిని తనరాజ్యమునకు "రక్షామణి" (Guardian Saint) గా బ్రతిష్ఠించెను. అంతటినుండియు రాయలు వ్యాసరాజస్వామిమందిరముననే సాయంకాలము తనదర్బారును జేయుచు నాస్వామి యుపదేశముల ననుసరించి రాజకీయకార్యములను నిర్వహించుచుండెను. అంతటితో దృప్తినందక నరసింహరాయ లీస్వామిని విజయనగరసింహాసనమున గూర్చొనజేసి సర్వవిషయముల నాయనకు నివేదించుచుండెను. అనేకప్రాంతములనుండి విద్వాంసులు వేనవేలుగ విజయనగరమున కేతెంచుచుండిరి. వీరిలో నెందరో వ్యాసరాజస్వామితో వేదాంతవాదములను గావించిరి. అట్టివారిలో కళింగదేశము నుండివచ్చిన బసవభట్టను నతడు ముఖ్యుడు. కొన్నిరోజులు వాదించి యీ పండితాగ్రణి యోడిపోయినను, వ్యాసరాజస్వామి యతని నెక్కుడుగ గౌరవించెను. ఇతరు లనేకులీయతివర్యునివద్ద విద్యనభ్యసించుచుండిరి. ఇట్లు విద్యానగర విద్యాపీఠమున శ్రీవ్యాసయోగీంద్రుడు కులపతిగనుండెను.

కృష్ణదేవరాయలు సింహాసనమునకు వచ్చిన పిమ్మట వ్యాసరాజస్వామి కీర్తిగౌరవము లింకను పెంపొందినవి. రాయలనాటి ప్రతిరాజకీయకార్యమునందును వ్యాసతీర్థుల పలుకుబడి గన్పించుచున్నది. రాయల పురోభివృద్ధికై స్వామి తుంగభద్రాతీరమున యంత్రోద్ధారక హనుమత్ప్రతిష్ఠను జేసెను. హంపీక్షేత్రమున కోదండరామస్వామి యాలయమునకు సమీపమున నొక చిన్నగుట్టపై నున్న యీ యాలయము నేటికిని గాంచనగుచున్నది. కృష్ణరాయలు వ్యాసరాజస్వామిని తన 'కులదేవత' గ బరిగణించి తన సర్వస్వము నాయన యారాధనకై వినియోగించుచుండెను. క్రీ. శ. 1514 లో రాయ లుదయగిరి విజయమునకై ననుజ నడుగగా నా యతివర్యు డచటి కృష్ణవిగ్రహమును దెచ్చి యిమ్మని గోరెను. విజయలక్ష్మీసహాయుడై మరలివచ్చి రాయలు కృష్ణవిగ్రహమును దెచ్చి గురువర్యునకు సమర్పించి, యొక సుందరమగు దేవాయతనమును నిర్మించెను. స్వామియే స్వయముగ నా విగ్రహము నందు బ్రతిష్ఠించి నిత్యపూజాదికములకై యేర్పా టొనర్చెను. ఇదియే నేడు హంపీ శిథిలములలో గాంచనగు "కృష్ణస్వామిదేవళము" మరుసటి సంవత్సరము కొండవీడు మున్నగు స్థలములను జయించిన తర్వాత గూడ రాయలు వ్యాసరాజస్వామి కన్నియో దానములను జేసెను.

క్రీ. శ. 1520 లో ముఖ్యమగు కార్య మొకటి జరగినది. అప్పటికి దక్షిణదేశమున వ్యాసయోగీంద్రునితో వాదింపగల పండితులు లేరైరి. అతని యాజ్ఞ ననుసరించి నిర్వహింపబడిన ప్రతిరాజకీయ కార్యమును సఫలమగుచుండెను. రాయలకు రానైయున్న యాపదల నెన్నిటినో యీ యతివర్యుడు తన తపోమహిమచే నివారించెను. రాయచూరు దుర్గమును వశపరచుకొని మహమ్మదీయులను కృష్ణాతుంగభద్రా మధ్యదేశమునుండి పారదోలవలెనని రాయలు ప్రయత్నములు సలుపుచుండెను. ఈమహాకార్యమును సాధించుటకై కులదేవతానుగ్రహ మవసరమని రాయలు తలంచెను. ఒక శుభదినమున మంత్రీపరివారసైన్యసామంతసమేతుడై మఠమున కేతెంచి, రాయలు వ్యాసరాజస్వామిని గజారూఢుని జేసి మహోత్సాహముతో నగరమంతయు నూరేగించి, తన సౌధమునకు తీసికొనిపోయి, బంగారు సింహాసనమున గూర్చొనజేసెను. అంత ననేకమంది పండితులును, రాజకీయోద్యోగులును, సామంతులును, సైనికులును స్వామికి సాష్టాంగనమస్కారముల నొనర్చిరి. పిమ్మట బ్రాహ్మణులు వేదమంత్రముల నుద్ఘోషించిరి. తట్టలతో రత్నములను దెప్పించి, చూపరు లెల్లరును జయజయధ్వానములను జేయుచుండ, నొక బంగారు గిన్నెను గైకొని, యానందబాష్పములతో రత్నరాజములను రాయలు వ్యాసరాజస్వామి కభిషేకము చేసెను. నగరమునందలి జను లాబాలగోపాలము నచటనే యుండిరి. పిమ్మట ప్రశాంతవదనుడై స్వామి యచటివారి నెల్ల నాశీర్వదించి, తన కభిషేకము చేయబడిన రత్నములను జనులకు బంచిపెట్ట నాజ్ఞాపించెను. దాని ననుసరించి రాయలు సామంతులకును, హిందూ మహమ్మదీయ సైనికులకు నా రత్నములను బంచియిచ్చెను. పిమ్మట గురుదేవుని యాశీర్వచనమునంది రాయలు రాయచూరు దండయాత్రకు దరలెను.

కృష్ణరాయల కాలమున జరిగిన మరియొక విశేషము కుహూయోగము. ఎప్పుడైనను అమావాశ్యనాడు దినాంత్యభాగమున త్యాజ్యసమయమున చంద్రుడు గన్పింపకుండు సమయమున రవి కుజ శని రాహువులు లగ్నమునగాని, అష్టమవ్యయముల గాని గలసినయెడల కుహూయోగమనియు, నట్టి లగ్నము గల రాజు మరణించు ననియు జ్యోతిషశాస్త్రమున గలదు. కృష్ణరాయ లది కుంభలగ్నము. పైన చెప్పబడిన గ్రహసంయోగము 1519–24 సంవత్సరములలో గాంచనయ్యెను. 1520 లో రాయచూరు యుద్ధమయిన వెంటనే పై యోగము తటస్థమయ్యెను. దానివలన రాయలకు గల్గు దుష్ఫలితమును

వ్యాసరాజస్వామి నివారించెను. వ్యాసయోగి చరితమును రచించిన సోమనాథకవి యీ విషయము నిట్లు వర్ణించి యున్నాడు. కుహూయోగ మారంభించిన వెంటనే వ్యాసరాజస్వామి విజయనగర రత్నసింహాసనమున గూర్చొని రాయలచే సామ్రాజ్యమును, ధనకనకవస్తువాహనాదు లన్నిటిని ధారాపూర్వకముగ బరిగ్రహించెను. కొలువుకూటమునం దుండిన మంత్రిసామంతాది సభ్యు లెల్లరును చకితులై యీ దృశ్యమును జూచుచుండగనే యొక మూల నుండి పెద్ద సర్ప మొకటి సింహాసనమువద్ద కేతెంచి యట్లే దానిపై నున్న యతివర్యుని గాంచి వెనుకకు బోయి తన పడగ నాతనికి ఛత్రమువలె బట్టెను. కుహూయోగము సమాప్తమైన వెంటనే యా సర్పము నిష్క్రమించెను. అంతట వ్యాసరాజస్వామి సామ్రాజ్యమును తిరిగి గైకొనుమని రాయల నడుగగా నతడు దత్తపరిగ్రహము చేయనని బదులు పల్కెను. కొంత వాదము జరిగిన పిమ్మట గురువు నాజ్ఞ నుల్లంఘింపజాలక కృష్ణరాయలు తన గురువర్యుని ప్రతినిధిగ రాజ్యభారమును వహించుట కంగీకరించెను. దీనితో వ్యాసరాజస్వామి మహత్వము విశ్వవిఖ్యాతి నందెను.

కొంతకాలమునకు బిమ్మట కృష్ణరాయని యేకపుత్రుడగు దిరుమలరాయడు మరణించెను. అంత రాయలు దేశాటనమునకై వెడలెను. రాజధానిలో రాయల తమ్ముడగు నచ్యుతదేవరాయలు నల్లుడగు రామరాయలును విజృంభించిరి. రామరాయలకు బ్రాహ్మణమతద్వేష ముండినది. ఈపరిస్థితులను గాంచి 1524 లో వ్యాసరాజస్వామి తాను నిర్మించిన వ్యాససముద్రమను గ్రామమునకు వెడలి మరి మూడేండ్లకు విజయనగరమున కేతెంచెను.

అచ్యుతదేవరాయల కాలమునగూడ వ్యాసరాజస్వామికి పూర్వపు బలుకుబడియు, నాయన యెడ రాయలకు భక్తిగౌరవములు నుండినవి. 1532 లో నీస్వామి విఠలదేవాలయమున యోగానందనృసింహస్వామిని బ్రతిష్ఠించెను. ఈకాలముననే రాయలకు ద్రవ్యావసరము గలుగ స్వామి శిష్యులలో నగ్రగణ్యుడగు వాదిరాజస్వామి యొక గుప్తనిధిని రాయలకు జూపించెను.

కర్ణాటకభక్తాగ్రగణ్యులును వ్యాసరాజస్వామి శిష్యపరంపరలోనివా రగు శ్రీపురందరదాసులచే రచింపబడిన యొక కీర్తనలోని "విళంబిసంవత్సర దల్లి విజయనగరదల్లి ఫాల్గుణ బహుళ చతుర్థి సిరవార" యను భాగము వ్యాసరాజస్వామి సిద్ధినందిన కాలము తెలుపుచున్నది. ఆకాలము క్రీ. శ. 1539 వ సంవత్సరము మార్చినెల 8 వ తేదీకి సరియగును. హంపీక్షేత్రమునకు మూడు మైళ్ళలో దుంగభద్రలోని 'నవబృందావన' మను ద్వీపములో నీ యతివర్యుని బృందావన మున్నది.

వ్యాసరాజస్వామి యొక యద్భుత వ్యక్తి. బాల్యముననే సన్యసించి పరమహంసాశ్రమమున నుండిన నిష్కామి యయ్యు, విద్యారణ్యస్వామివలెనే హిందూమతోజ్జీవనమునకు కంకణము గట్టుకొనిన మహానుభావు డీ యతివర్యుడు. అయిదుపురుషాంతరముల విజయనగర పాలకులచే నితడు సామ్రాజ్యరక్షామణిగను, కులదేవతగను బూజింపబడెను. విద్యాధికారిగ నుండి యీ పండితాగ్రణి విజయనగరమున నొక విద్యాపీఠము నొనర్చి, పండితులెందరికో వృత్తుల గల్పించెను. ఈయన యాలోచన ననుసరించియే రాజులు వ్యవహరించిరి. అనేక సమయములలో నీయన హిందూరాజ్యరక్షణార్థమై మహమ్మదీయులకు దాత్కాలికముగ లాభమును గల్గించెను. ఇందులకు బ్రతిఫలముగ నొకప్పుడు బిజాపురసుల్తానగు యుసఫ్ ఆదిల్షా యొక యొంటెను పచ్చని ధ్వజము నీస్వామి కర్పించెను. ఈ పతాకము నేటికిని వ్యాసరాజమఠమున గలదు. దేశాంతరమునుండి వచ్చి రాయల యనుగ్రహము సంపాదింప దలచిన పోర్చుగీసు రాయబారులు వ్యాసరాజస్వామి నాశ్రయించి కృతకృత్యు లగుచుండిరని "ద్వీపాంతర భూపాలకసంప్రేషిత ప్రధానపురుషై రసకృత్సమర్ప్యమాణాని బహు

విధోపహారపూజనానిచ” యను వ్యాసయోగి చరితము నందలి గద్యభాగమునుండి తెలియుచున్నది. "The King of Bisnaga is a Brahmin. Everyday he hears the preaching of a learned Brahmin who never married nor ever touched a woman" అను న్యూనిజ్ వ్రాతగూడ యీ స్వామికిగల కీర్తిని దెల్పుచున్నది.

ద్వైతమతమునకు వ్యాసరాజస్వామి చేసినసేవ నిరుపమము. ఈయన మూలముననే విజయనగర సామ్రాజ్యమున నీ మతమునకు విశేషముగు వ్యాప్తి గలిగినది. ఈయనచే రచింపబడిన "తాత్పర్యచంద్రిక న్యాయామృతము, తర్కతాండవము" నను వేదాంతగ్రంథములు నేటికిని పండితలోకమునం దగ్రస్థానము నలంకరించియున్నవి. వీర శైవులుజనోపయోగార్థమై పాటలను, పదములను, ద్విపదలను రచించినట్టులే యీ స్వామిగూడ ద్వైతమతసిద్ధాంతమును పామరజనోపయోగార్థమై కీర్తనారూపమున బోధించెను. ఈ కీర్తనలు నేటికిని కర్ణాటమున ప్రతివారినోటను వినవచ్చుచున్నవి. వీనిని పాడుచు హరిభజన చేయువారును, స్వతంత్రరచనల జేయువారు నెందరో దాసులు బయల్వెడలిరి. ఈ పద్ధతికి "దాసకూట" మని పేరు.

వ్యాసరాజస్వామి యీ సంగ్రహ చరిత్రము వారి శిష్యుడగు సోమనాథుడు రచించిన "వ్యాసయోగి చరితము" ననుసరించి వ్రాయబడినది. ఇందుల కుపకరించు విశేషాంశములను దెల్పు శాసనాదికము లెన్నియో గలవు. చరిత్ర జిజ్ఞాసువులీ మహాపురుషుని జీవితమును బరిశోధించి సమగ్రముగ రచింతురుగాక !

ఆంధ్రరాష్ట్రనిర్మాణావశ్యకము

ప్ర. పార్థసారథిగారు బి. ఏ. బి. కామ్. ఎల్. ఎల్. బి (Bom)

శ్రీ భావరాజు వేంకటకృష్ణారావుగారు ఏప్రిలునెల ప్రబుద్ధాంధ్రసంచికలో "ఇపుడు మనకు ప్రత్యేకాంధ్రరాష్ట్రనిర్మాణం అవసరమా" అనే శీర్షిక క్రింద స్వాభిమానపూరితమైన వ్యాసం ఒకటి ప్రకటించినారు. అవ్యాసంలో వారి మూలాభిప్రాయం ఆంధ్రు లందరు సంఘీభావము కలిగి ఏకమనస్కులై కలిసికట్టుదనంతో ఉండి, "యశోధురంధర శీలురై తమ సుచరిత్రము ప్రచండప్రతాపము ప్రజ్ఞ శక్తిసామర్థ్యములు అభినివేశము ఉత్సాహము మొదలైనవి బ్రహ్మాండమంతా నింపి 15 శతాబ్దములు మహావిభవముతో వెలిగి చివరకు దక్షిణదేశంలో తంజావూరు మధురానగరరాజ్యములలో మిణుకుమిణుకుమంటూ అస్తమించిపోయిన పూర్వపు ఆంధ్రుల" యశశ్చంద్రికను తిరిగి పునరుద్ధరించవలెనని. ఈ ఆశయం మహోత్కృష్టమైనది. మన అధిక్యము యితరులకు తెలియవలె నన్నా, మన మాట నలుగురిలో నెగ్గవలె నన్నా, మనలో మనం ఐకమత్యం కలిగి యుండవలె. మన వ్యక్తిత్వాన్ని మనం స్థాపించుకోవలె నన్న అందుకు అడ్డంకు లన్నీ తప్పించి అవసరమైన సదుపాయము లన్ని సమకూర్చే ప్రత్యేకరాష్ట్రం చాలా అవసరమే. అయితే మనం నలుగురు కలిసి ఏదైనా పని చేయవలసిఉంటే, అందులో ఒకరి నొకరు తిట్టుకొనుచు, ఒకరి నొకరు వెక్కిరించుకొనుచు కబుర్లతో కాలక్షేపం చేయ

టం వల్ల పని సాగదు. పైపెచ్చు "త్వం శుంఠా త్వం శుంఠా" అని ఒకరితో నొకరు కలహించుటవల్ల ఏసదాశయంతో అయితే యీపనికి పూనుకొన్నారో, తొందరమాటలవల్ల అనవసరమైన దూషణవల్ల పరస్పరవైషమ్యాన్ని పెంపొందించి, ఆ ఐకమత్యానికి ఇదివరకేమన్నా అవకాశం ఉంటే దానికి కూడా అంతరాయం కలిగిస్తూన్నారు.

శ్రీరావుగారి వ్యాసంలో ముప్పాతిక మూడు పాళ్ళంతా దత్తమండలవాసులపై తమకుగల స్పర్థను, ఏహ్యతను, దుస్సహమైన కఠినపదాలతో వెళ్లడిచేసారు. "రాయలసీమవాసుల హృదయక్షేత్రంలో అవిశ్వాసము, అసూయ, అనుమానము మొదలైన విషఅంకురములు మొలకలెత్తి వ్రేళ్లుబారి ప్రాతుకట్టుకొని ఉన్నవి......పాషాణమైన కరగి చదు నవును గాని లోహము వజ్రసన్నిభమైన వస్తువులు చలింపవు...ఉత్తరసర్కారులవారు ఏయుద్యమం తలపెట్టినా అది యేదో జిత్తో, పామో, విషమో అని మొదటినుంచి భయం శంకలతో పరిశీలించి అడుగడుక్కీ అనుమానపడే అలవాటు రాయలసీమవారికి పరిపాటి అయింది......దత్తమండలవాసుల మనసులో అసూయ అవిశ్వాసం మాత్సర్యం పెరుగుచున్నాళ్లు ఉత్తరసర్కారువారికి వారికి పొత్తు కుదురజాలదు......ఊసరక్షేత్రములపై పుట్టి పెరిగిన దత్తమండలవాసుల మానసములు పాషాణసన్నిభములై శంకతో, అసూయతో మాత్సర్యముతో వక్రబుద్ధితో నిండి యుంటవి...ఈ విషప్రవృత్తి దత్తమండలవాసులకు నైజగుణము. రంధ్రాన్వేషణమే పరమార్థముగా నెంచుకొని అసూయాగ్రస్తులైన దత్తమండలనాయకులు లేనిపోని శంకలలో బడి వ్యాకులత నొందుచున్నారు. దత్తమండలమువారి కుట్ర యింతవఱకు ఉన్నదని సర్కారులవారు గ్రహించలేకపోయినారు" మొదలైన నిందావాక్యాలతో అతిపరుషంగా ఉద్రేకాధిక్యంతో తాము చేస్తున్న పని తెలుసుకోకుండా, భాషలో ఎన్ని కఠినోక్తు లున్నవో అన్నిటిని అతి తీక్ష్ణంగాను విరివిగాను ప్రయోగించి దత్తమండలవాసులని అనరాని మాట లన్నారు.

"తమ చిత్తవృత్తిని బట్టి పరుల మనసును నిర్ణయించుకొనుట మానవుని నైజగుణము" అని శ్రీరావుగారే తమ వ్యాసమందు వ్రాసియున్నారు. పైజూపిన శ్రీరావుగారి నిందావాక్యము లన్నియు గూడ ఆసూత్రముపై ఆధారపడి వ్రాయబడినవని నమ్మవలసిన దేనా?

ఇట్టి వ్రాతలు పరస్పరస్పర్థలను పెంచుటకు దోహదము చేయును, ఆంధ్రజాత్యైక్యమునకు అంతకంతకు ఆటంకమును కలిగించుచున్నవి. సంఘీభావ మెన్నడు తిట్లవలనను హేళనమువలనను కుదురదు. ఐకమత్యము కావలెనన్నచో, పరస్పరసహాయము, అన్యోన్యము కావలె. అందుకు ముఖ్యసాధనములు ఇచ్చిపుచ్చుకొను పద్ధతి. వారికి వలయు సదుపాయముల తాము గూర్చవలె. తమకు వలయు సదుపాయముల వారు గూర్చవలె. సదుపాయము లన్నియు మాకు, ఇబ్బంది లన్నియు మీకు అను స్వలాభపద్ధతి ఎంతమాత్రము పనికిరాదు. విశ్వవిద్యాలయమున దత్తమండలమువారు కలియలే దని ఘోషించిన ఏమి ప్రయోజనము! వారు "బ్రతుకుతెరు వెరుగని" వా రన్న ఏమి ప్రయోజనము! ఆంధ్రసీమ కంతకు నొకమూల నెచ్చటో సరిహద్దుప్రాంతమున (గంజాంజిల్లా కూడ ఓఢ్రరాష్ట్రములో జేర్పబడుచో విశాఖపట్టణము జిల్లాయే ఉత్తరసరిహద్దగును) విశ్వవిద్యాలయమును తత్సంబంధమగు కళాశాలలను బెట్టి 7, 8 జిల్లాలు దాటి రమ్మని దత్తమండలవాసుల నాహ్వానించుట ఇసుమంతయు సమంజసముగ లేదు. ఇట్లంత దూరము వచ్చుటకు దమ కష్టముల దెలుపుచు సమీపమందున్న మరియొక విశ్వవిద్యాలయమునకు వారేగుచుండ వారి నీరీతి నిందించుట అంతకన్న తప్పు. ఆంధ్రవిశ్వకళాపరిషత్తు ఒక్క విశాఖపట్టణము, రాజమండ్రి వారి సొత్తు కాదు. అది ఆంధ్రసీమ కంతటికిని సంబంధించిన సంస్థ.

అది అన్నిజిల్లాలవారికి అందుబాటులో నుపయోగకరముగ నుండవలె. స్వాభిమానపూరితము లగు సంకుచిత భావములతో మాపట్టణ మనాదినుండి విద్యాస్థాన మని కాని మాపట్టణ మెన్నడో గొప్ప రేవుపట్టణము కాబోవు నని కాని, మాపట్టణము చారిత్రకప్రసిద్ధ మైన దని కాని మొదలగు కారణములచే అట్టి సర్వరాష్ట్రోపయుక్త మగు సంస్థను తమ పట్టణములందే యుండునటుల యత్నించుట తగదు. సర్వజనోపయోగకరముగ నుండనప్పుడా సంస్థ ప్రయోజనమే పోవును. నేటి ఆంధ్రవిశ్వకళాపరిషత్తు మొత్తముమీద ఉత్తరసర్కారుల విశ్వకళాపరిషత్తు'' గా తేలినది. బెజవాడలో విశ్వవిద్యాలయమేర్పాటై యుండెడిచో, అన్ని జిల్లాలకును సరియగు కేంద్రస్థానమున నుండి, ఎవరికిని సంకోచమున కవకాశ మేర్పడెడిది కాదు. ఇట్టి సమస్యల పరిష్కరింపవలసి వచ్చినపుడు ప్రతివాదును సంకుచిత భావముల విడనాడి, విశాలబుద్ధితో నాలోచించి, తన పట్టణముపై గల యభిమానము, తన పేటపై గల యభిమానము వదలి, ఔదార్యముతో సర్వోపయుక్తముగ మెలగవలె. నేటి రాష్ట్రాభిమానము (Provincial feeling) నానాటికి జిల్లా అభిమానముగను, జిల్లా అభిమానము పట్టణాభిమానముగను, పట్టణాభిమానము పేట అభిమానముగను మారి, సంకుచితభావము వృద్ధిజెంది, జాత్యైక్యమునకును, రాష్ట్రైక్యమునకును అడ్డు తగులుచున్నది. ఈ సంకుచితభావములు మాని, విశాలహృదయం ఏర్పడితేనే గాని జాతౌన్నత్యం కలగదు.

శ్రీరావుగారు దత్తమండలవాసులు చేరకపోతే ఆంధ్రవిశ్వవిద్యాలయానికేమీ లోటు రాలే దని వ్రాసినారు. ఆంధ్రరాష్ట్రనిర్మాణసమస్యలో కూడా శ్రీరావుగారి అభిప్రాయ మిదేనా? అది చాలా పొరబాటు. ఆంధ్రదేశంలో సగం మంది దానిలో చేరకపోయిన తరువాత అది ఆంధ్రవిశ్వకళాపరిషత్తు ఎట్లా అవుతుంది? ఒక్క విశాఖపట్టణం, ఉభయగోదావరీ, కృష్ణా, గుంటూరు జిల్లాలు మాత్రమే ఆంధ్రదేశం కాదు గదా! ఆంధ్రప్రతిభను, ఆంధ్రవాఙ్మయపోషణను మూలాధారమై 5, 6 శతాబ్దములు ఆంధ్రజీవనాన్ని పెంపొందించిన శ్రీకృష్ణదేవరాయప్రభృతులు, రెడ్డిరాజులు, శ్రీరావుగారి పూర్వఆంధ్రజిల్లాలవారు కారు. ఈనాడు కూడా ఆంధ్రప్రతిభ అంతరించకుండా అక్కడక్కడ మిణుకుమిణుకు మంటున్న దంటే అందుకు పునాదులు వేసినవారు, మధ్యయుగంలో మహమ్మదీయుల దాడినుండి ఆంధ్రకళను, ఆంధ్రవాఙ్మయాన్ని, ఆంధ్రజీవనాన్ని రక్షించి, పూర్వఆంధ్రజిల్లాలో అంతా నిదురించుచుండగా దేశమునకు భాసటయై నిలచినది దత్తమండలవాసులు. వారిని విసర్జించి మా అంతట మేమే అంతయు నేర్పాటు చేసుకొనెద మనుట చాల పొరబాటు. విశ్వవిద్యాలయము ఆంధ్రు లందరి నొక్కదరి జేర్చుటకు చాల సహాయకారి యగు ఆయుధము. దాని నన్ని జిల్లాలవారికిని సమపాయముగ నున్న కేంద్రస్థానమగు బెజవాడలోనే యుండనిచ్చినచో ఆంధ్రరాష్ట్రనిర్మాణవిషయమున చాల కాలము క్రిందటనే కట్టుదిట్టము లగు యేర్పాటులు జరిగియుండెడివి. విశ్వవిద్యాలయము విషయముననే, ఇట్టి సంకుచితాభిమానముతో ఏమూలకో ఈడ్చుకొనిపోయిన ఉత్తరసర్కారుమహనీయులు, రాష్ట్రకేంద్రస్థానమును గూడ నట్టి మారుమూల కీడ్చెద రని భయము జెందుట కవకాశము లేకపోలేదు. అందుచే దత్తమండలవాసులు సంశయించుటయం దాశ్చర్యము లేదు. దత్తమండలవాసులు మాత్రము విశ్వవిద్యాలయమును, కళాశాలలను, ఏఅనంతపురమునందో తెచ్చిపెట్టవలె నని మనవలె కోరుట లేదే! అట్లు విశ్వవిద్యాలయకేంద్రస్థానమును రాష్ట్రకేంద్రస్థానమును ఏకడపలోనో కర్నూలులోనో ఏర్పరచుచో పూర్వాంధ్రులు విముఖులు కాకుందురా? అప్పుడు మనము (పూర్వాంధ్రులు) అసూయాపూరితుల మని, మాత్సర్యపూరితుల మని పశ్చిమాంధ్రు లన్నచో మన కెట్లుండును? వారు మాత్రము మనవంటివారు

కారా? వారు కోరునది నలుగురకు అందుబాటులో నుండునటుల ఏర్పాటు చేయవలసిన దనియే కదా!

ఆంధ్రరాష్ట్ర మేర్పడవలె నన్న ప్రథమమున విశ్వవిద్యాలయమును బెజవాడకు మార్చి, అన్ని జిల్లాల వారికిని సరియగు ఏర్పాటుల జేయుటకు సిద్ధముగ నున్న సంగతి సూచింపవలె. బెజవాడ, ఆంధ్రదేశములో నితరపట్టణము లన్నిటికంటె అతి శీఘ్రముగ నభివృద్ధి జెందుచున్నది. 1891 మొదలు 1931 వరకు జనాభాలెఖల వివరముల బట్టి జూచినచో మిగిలిన పట్టణము లన్నియు తాబేటి నడక సాగించుచుండ బెజవాడ ఎంత స్వల్పకాలమున ఎంత ఉన్నతస్థితికి వచ్చుచున్నదో తెలియగలదు. బెజవాడలో, విశాఖపట్టణము రాజమహేంద్రవరం మొదలగు పట్టణములలోవలె ప్రభుత్వమువారి జిల్లా కేంద్రకార్యాలయములు (District Head quorters) గాని, కళాశాలలు గాని లేవు. సామాన్యముగ నట్టి కార్యాలయము లన్నియు నుండెడి చోట్లు ప్రాముఖ్యమునకు వచ్చుటయు, జనాభా నానాటికి వృద్ధి జెందుటయు సహజము. ఈ అభివృద్ధిని బట్టి చూచినచో అత్యల్పకాలముననే బెజవాడ ఆంధ్రరాష్ట్రమున అన్ని పట్టణములకంటె పెద్దది కాకమానదు. ఇప్పటికే ఆంధ్రప్రాంతమందలి మునిస్పాలిటీ లన్నిటిలోను బెజవాడకు మిగిలిన వాటి కన్న రాబడి చాల యెక్కువగ నుండుట ఆ నగరాభివృద్ధి సూచించుచున్నది. బెజవాడ కీవలి వైపున కృష్ణా, ఉభయగోదావరీ, విశాఖపట్టణము జిల్లా లుండ, ఆవలివైపున నింత కన్న అధికముగ గుంటూరు, నెల్లూరు, కడప, కర్నూలు, అనంతపురం, బళ్లారి జిల్లా లున్నవి. ఇది గాక నైజాం రాష్ట్రములోని స్వభాష కట్టి పోషణయు లేని 80 లక్షలకు పైబడిన తెలుగువారికి, అవసర మైనచో దాక్షిణాత్య, మైసూరు ఆంధ్రులకు గూడ అందుబాటులో నుండి వారికి విజ్ఞానోపదేశమునకు సహాయకారి యగును. అందుచే సర్వవిధముల విశ్వవిద్యాలయకేంద్రస్థానమునకు బెజవాడ మిగిలిన పట్టణములకంటె ఎంతయు తగియున్నది. బెజవాడకును విశాఖపట్టణమునకును గల తారతమ్యము ఈ క్రింది వివరాలవలన తెలియగలదు.

ఎచటినుండి	బెజవాడకు				విశాఖపట్టణమునకు				మద్రాసుకు			
	మైళ్ళదూరము	రైలుఛార్జి			మైళ్ళదూరము	రైలుఛార్జి			మైళ్ళదూరము	రైలుఛార్జి		
		రూ.	అ.	పై.		రూ.	అ.	పై.		రూ.	అ.	పై.
అనంతపురం	323	6	11		540	10	10		319	6	10	
బళ్లారి	310	6	7		527	10	6		306	6	6	
కడప	393	7	15		610	11	14		162	3	8	
గుంతకల్	280	5	14		497	9	13		276	5	13	
నెల్లూరు	160	3	7		376	7	10		109	2	6	
విశాఖపట్టణము	217	4	10									

కడప, కర్నూలు, అనంతపురం, నెల్లూరు మొదలగు పట్టణములకు మద్రాసు బెజవాడ కన్న సమీపమైనా, రాష్ట్రాభిమానంచేత వారంతా బెజవాడకే వస్తా మన్నారు; విశ్వవిద్యాలయం అక్కడ ఉంటే బెజవాడ కూడా దాటి యింకా 217 మైళ్లు వాళ్లని రమ్మన మనటంలో సబబు లేదు. అన్ని జిల్లాలవారికి సరియగు కేంద్రస్థాన మేర్పడుచో దత్తమండలవాసులు ఉత్తరసర్కారువారితో చేయి కలిపి రాష్ట్రాభివృద్ధి భాగ్యోదయమునకు తమ సర్వశక్తుల వినియోగించుటకు వెనుదీయరు. విశాఖపట్టణమున అధికధనము వెచ్చించి నిర్మించిన భవనముల నేమి చేయవలె నని కొంద రడుగవచ్చును.

సాంకేతికకళాశాల మున్నగు కొన్ని కళాశాలలచ్చటనే యుండనిండు. విశ్వకళాపరిషత్తు కార్యాలయమును మరికొన్ని ఇతరకళాశాలలను బెజవాడకు మార్పు చేయవలె. ఉత్తరసర్కారువారు దత్తమండలములవారి కష్టసుఖములందు పాల్గొనుటకు వెనుదీయరని, తామెండొరులకు విభేదములు లేవని తమ ప్రవర్తనవలన తెలియజేయవలె. "మాకు రాయలసీమవారు లంటే ప్రేమ గలదు. అని ఎంత నొక్కి చెప్పితే నేమున్నది? నిజమైన ప్రేమ యున్నదో లేదో చేతలయందు కనబరచవలె" శ్రీరావుగారే చెప్పినట్లు.

అంతియే కాని, తప్పు మనయొద్ద నుంచుకొని వారి కన్ని విధముల ఇబ్బందులు కలిగించి ఆంధ్ర విశ్వకళాపరిషత్తునుండి తొలగిపోవలసినంతటి దురవస్థను కలిగించుటయే గాక మీదుమిక్కిలి వారి నీవిధముగ శ్రీరావుగారివంటి విజ్ఞానులు కూడ తూలనాడి అవమానపరచుట మన ఉత్తరసర్కారులవారి ఇంగితజ్ఞానశూన్యతను సంకుచిత హృదయమును బ్రకటించుచున్నది. కాలు జారిన తీసుకొనవచ్చును గాని, మాట జారిన తీసుకొనలేము. మంచి మాటలచేతను, సౌహార్దము చేతను దత్తమండలము వారి హృదయముల నాకర్షింపవలె కాని, చీవాట్లచేతను, వెక్కిరింతలచేతను గాదు. ఏదో విధివశమున డెల్టాభూమి యగు గోదావరి జిల్లాలో మనము జన్మించి యిట నుండుట ఏర్పడినంత మాత్రమున మనము "మెత్తని మట్టిపై పుట్టి పెరిగినందున మెత్తని మనసు గలవార మనియు, ఉదారవంతులము, ఉత్సాహవంతులము, కల్ల కపటము లెరుగనివార మనియు, దత్తమండలప్రజలు కర్కశమైన పాషాణభూములందు పుట్టి పెరిగి బోడికొండల మధ్య నిస్సారము లైన లోయప్రాంతములలో నీటిచుక్క నిలువని ఎఱ్ఱమట్టి ఊసరక్షేత్రములపై పుట్టి పెరిగిన వారగుటచే వారి మానసములు పాషాణసన్నిభము లయి శంకతో అసూయతో మాత్సర్యముతో వక్రబుద్ధితో నిండియుండు" ననియు మొదలగు విపరీతభావములు శ్రీరావుగారివంటి మహనీయుల లేఖినినుండి వెలువడుట మిక్కిలి శోచనీయము. అంతగా తమ ప్రశసిని వారు వ్రాసుకొనినందున ఒక ప్రశ్న మాత్ర మడుగవలసి యున్నది. "హేమకేదారఖండములు దేవమాతృకలు గలిగి పావనమైన......జీవవాహిను లైన మహానదులు ప్రవహించి సర్వసమగ్రసస్యసాఫల్యముగా......శ్రమ పెట్టకయే అడిగినమాత్రాన ఫలము సమృద్ధిగ నొసగే జనని యగు మెత్తని మట్టిపై పుట్టి పెరుగుటకు" మన స్వప్రయోజకత్వమే మైన కారణమా? తోటి సోదరులు శ్రీరావుగారు వ్రాసినట్లు "బోడికొండల నడుమ నిస్సారము లయిన లోయప్రాంతములలో నీరు చుక్కలు నిలువని ఎఱ్ఱమట్టినేలపై రక్తమాంసములు ధారబోసిన గాని జీవనాధారం" దొరకని దుర్భరస్థితిలో నుండుట జూచి, వారి కష్టముల నివారించుటకు గాని, వారికి జలాధారములు మొదలగువసతుల నేర్పరచుటకు గాని ఇంతవరకు అధికారంలో ఉన్న "ద్వంద్వప్రభుత్వవిధానాన్ని జయప్రదంగా నడపిరని చెన్నరాజధాని కద్వితీయమైన యశస్సు, ప్రశంసగడించిన ఆంధ్రులే" మైనా చేసారా? మన సోదరుల దౌర్భాగ్యము మనది కాదా? వారి కష్టసుఖములు మనవి కావా? స్వతంత్రరాష్ట్రమే ఉంటే ఇంతకాలంవరకు మన దత్తమండలసోదరుల కట్టి ఇబ్బందులు, అట్టి ఇబ్బందుల గూర్చి శ్రీరావుగారి వెక్కిరింతల వంటి పొరుపుమాటలు పడవలసిన దౌర్భాగ్యదశ యుండెడిది కాదు.

"మాంటుఫర్డు శిఫారసులు అమలులోనికి వచ్చినది మొదలు ద్వంద్వప్రభుత్వాన్ని జయప్రదంగా సాగించి మద్రాసురాజధానికి పేరు ప్రతిష్ఠలు తెప్పించింది ఆంధ్రులే" అయినా "చెన్నరాజధాని రాజ్యాంగమందు నేడు కూడా ఆంధ్రుడిదే నాయకత్వమైనా ఇంతవరకు అట్టి అధికారులవల్ల తమ బంధుగు లెవరికో నాలుగు ఉద్యోగములు దొరక

టను తప్ప ఆంధ్రదేశం మొత్తాని కంతా తుంగభద్రాప్రాజెక్టువంటి ఒక పెద్ద ఉపకార మైనా జరిగిం దని వేలువంచి చెప్పలేము.'' అయినా శ్రీరావుగారు "భరతఖండంలో ఏజాతులకైనా ప్రత్యేక రాష్ట్రం అవసరం కావచ్చును కాని ఆంధ్రులకు మాత్రం అవసరం కా దని నిశ్చయంగా చెప్పసాహసిస్తా'' మన్నారు. పైపెచ్చు "ఆంధ్రుజాతి తన పూర్వపు శక్తులన్నింటిని పూర్తిగా అలవరచుకోవటానికి ఇంకా కొంతకాలం చెన్నపురిరాజధానియందే యుండడం శ్రేయస్కరం,'' అంటూ దీనికి రెండు కారణాలు చెప్పారు. ఒకటి, "ఆంధ్రుల సంగీతము అరవదేశములో కాలువిరిగి దిక్కుమాలి కూలిపోయి పడివుంది. ఆ యువ్వ కుపశమనం కలుగజేసి తారుణ్యా మిచ్చి ఆమెను ఆంధ్రదేశానికి మరల తీసుకొనిరావలసిన బాధ్యత ఆంధ్రులయందున్నది.' రెండవది "మన సారస్వతలక్ష్మి—మన నాగరికతాచిహ్నము దిక్కుమాలి తంజావూరునందు కుందుచున్నది. దీనిని ఆంధ్రులు తమ దేశంలోనికి తర్లించుకొని రాగలరా?......మన ఆంధ్రగ్రంథము లయినా వాటికి ప్రతులైనా వ్రాసుకొనిచ్చి తెచ్చుకోవలె. ఇట్టివి మనము చెన్నరాజధానిలోనుండి విడిపోవకపూర్వము సంపాదించుకోవలసినవి ఎన్నో ఉన్నవి.'' ప్రత్యేకరాష్ట్రనిర్మాణానికి యీపై జెప్పబడిన రెండు అభ్యంతరాలకీ ఏమాత్రం సంబంధం ఉన్నదో చదువరులే యూహింతురుగాక. పుస్తకముల ప్రతులు వ్రాసి తెప్పించుకోవడానికైనా మనవారి నందరిని దాక్షిణాత్యుల కన్న గొప్ప గాయకశిఖామణులుగా తయారుచేయడానికైనా మరే యితరకార్యం చేయడానికైనా మనకు స్వతంత్రరాష్ట్ర ముంటే ఉండే శక్తిసామర్థ్యాలు మరొకరి పంచ నొదిగియున్నప్పు డుండవు. కష్టంఒకరిది అనుభవం మరొకరిది అవుతున్నది ప్రస్తుతం. శ్రీరావుగారే తమ వ్యాసంలో మరొకచోట "రాజ్యాధికారం కైవసం చేసుకొన్నప్పుడు దురాశాపరుడై తమకు రొట్టె యితరులకు ముక్క అన్నట్లు అరవజాతి వలె'' అని వ్రాసిఉన్నారే? అన్ని అసందర్భాలు తెలిసీ ఉండి కూడా "మద్రాసీ లని పిలిపించుకోవడం కూడా'' యిష్టం లేనప్పటికీ, "యిప్పుడే అరవలతో పేరుపడడానికి ప్రయత్నం చేయడం కూడా యెందు కని'' ప్రశ్నించే శ్రీరావుగారి పరస్పరవిరుద్ధమైన మాటలలో ఇంచుకైనా దూరదృష్టి పూర్వాపరాలోచన ఉన్నదా అని సందేహం.

ఇంతే కాకుండా శ్రీరావుగారు "ఆంధ్రులు దక్షిణాపథ మంతా పాకి ఉన్నారు. అటు పడమట బొంబాయిరాజధానిలో నున్నారు. ఉత్తరాన మధ్యపరగణాలలో ఉన్నారు. దక్షిణాన అరవదేశంలో ఉన్నారు. మైసూరులో ఉన్నారు, ...ఒక ఉత్తరసర్కారులవారు తప్ప మిగిలినవా రెవ్వరూ ఆంధ్రుల మనుకొని గర్విస్తున్నట్లు కనపించడం లేదు......నైజాం ఆంధ్రభాగం మైసూరు ఆంధ్రభాగం ప్రత్యేకాంధ్రరాష్ట్రంలోకి రాజాలవు. దక్షిణాదికి పూర్వం వలసబోయి మేము కూడా తెలుగువార మున్నా మని చెప్పుకుంటున్న ఆంధ్రులు తెలుగుభూమిలోనికి మరల వలస రాజాలరు. ఒకవేళ ఆంధ్రరాష్ట్ర నిర్మాణం కావడమే తటస్థిస్తే ఒక పెద్ద ఖండం అన్యరాజ్యంలోనే ఉండిపోతుంది.'' అంటూ యేమేమో వ్రాసినారు. ప్రత్యేకరాష్ట్రం నిర్మాణం కాగానే, అనేక తరముల క్రిందటనే వలసపోయి అక్కడ మడిమాన్యముల సంపాదించి నివసించుచున్నవారు, ఎక్కడో నాలుగు డబ్బులు తెచ్చుకొని బ్రతుకుతున్నవాళ్లంతా పరుగెత్తుచు ప్రత్యేకరాష్ట్రంలోకి వచ్చివేయవలె ననే సూచన విచిత్రంగా ఉంది. అమ్మ పెట్టదు. అడుక్కొని తిననియ్యదనే విధంగాఉంది మన ప్రాంతములలో తగు వసతి జీవనాధారం లేకుండుటచేతనే కదా, మనవా రితరప్రాంతముల కేగిభుక్తి గడించుకొనుచుండిరి. ఇక్కడ ఉన్న వారికే తిండిలేక మాడుచుండ, ఎక్కడనో సుఖము

గా జీవించువారిని గూడ మన ఆధారముల నెల్ల
విడిచి, తిరిగి వచ్చి మమ్మే నడుప గూడు లేక
కృశింపు మనుట న్యాయ్యము కాదు. ఆంధ్రు డెట
నున్నను ఆంధ్రుడే యగును కాని మరొకడు కాడు.
శ్రీరావుగా రెరుగుదురో, ఎరుగరో కాని బొంబా
యి కలకత్తా ఖర్గపురము మొదలగు ఆంధ్రులున్న
ప్రతిచోటను ఆంధ్రసంఘములు, ఆంధ్రసంస్థలు,
ఆంధ్రక్లబ్బులు, నెలకొల్పబడి, ఆంధ్ర మన్న తమ
సర్వస్వము వినియోగించునంతటి అభిమానమును
రాష్ట్రేతరాంధ్రులు చూపుచున్నారు. అట్టి రాష్ట్రే
తరాంధ్రులకు గూడ తగు సదుపాయముల నొడ
గూర్చుటకు గాని విజ్ఞానోన్నతికి గాని తోడ్పడు
టకు మనకు తగు స్వాతంత్ర్యము సామర్థ్యము ప్రత్యే
కరాష్ట్ర ముండిననే కాని లభింపదు. ఆంధ్రుడే
రాష్ట్రములోనో గొప్ప పదవిలో నున్నాడంటే
ఆ ప్రతిష్ట యావదాంధ్రదేశానికి చెందినది కాని ఒక
వ్యక్తికి చెందినది కాదు. శ్రీకాతా రామమోహన
శాస్త్రి చిత్తరువుల కచ్చేరు వంది ఆమెర్కికా వారు
బహూకరించినా రన్న ఆ ప్రతిభ ఆంధ్రకళ యంత
టిది. ఆంధ్రదేశ మంతటిది. తన కళకు తగు సన్మా
నము గల ఏ అహమ్మదాబాదులోనో గౌరవముగా
జీవనము గడుపుచున్న రామమోహనశాస్త్రిని ప్రత్యే
కాంధ్రరాష్ట్రం రాగానే యిక్కడకు తిరిగి వచ్చి
వేయమంటే యేమైనా అర్థం ఉందా? ఆ ప్రకారం
కూపస్థమండూకాలు లాగ బయటకు పోకుండా
యింట్లోనే కూచుంటుంటే ఆంధ్రుల గొప్ప ఆం
ధ్రుల ప్రతిభ, బయటివారి కెల్లా తెలియడము?

శ్రీరావుగారు ఆంధ్రరాష్ట్రనిర్మాణం ప్రస్తుతం
అవసరం లేద నేందుకు చెప్పే కారణాలలో ఒకటీ
సరి అయినది కాదు. సాధ్యమైనంత త్వరలో తమ
పరస్పర వైషమ్యాలనిమరచి ఆంధ్రులంతా ఒక్కుమ్మ
డిగా ఆంధ్రరాష్ట్రనిర్మాణానికి నడుము కట్టుకొని,
ప్రత్యేకరాష్ట్రం నిర్మించుకొని, ఆంధ్రకళ, ఆంధ్ర
జీవనము, ఆంధ్రసారస్వతము, ఆంధ్రప్రతిభ, ఆంధ్ర
యశఃకాంత తిరిగి తలయెత్తుకొని నల్దిక్కుల నిర్భ
తిగ, నిరాటంకముగ తన వెలుగుకిరణాలని వెద
జల్లుతూ సంచరించునటుల చేయవలసిన బాధ్యత
అందరిపైనా ఉంది. ఆంధ్రసోదరుడా! మేలుకొ
నుము. పరస్పరదూషణములు నిరుపయోగములు.
వాక్కలహములు వ్యర్థములు. ఐకమత్యము కలిగి
అన్యోన్యసహాయమున జాత్యభ్యుదయమునకు దోడ్ప
డుము.

రామాయణప్రక్షిప్తభాగవిచారణ

మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు

బ్రహ్మాండపురాణాదులు రామాయణగ్రంథసంఖ్య
నూఱుకోట్లు ఏబదికోట్లు పదికోట్లు కోటిగా దేవ
గంధర్వాదిలోకములందు వ్యాపించినదని విపరీతము
గా వర్ణించియు, మానవలోకమందు విస్తరించినది
యిరువది నాలుగువేల గ్రంథమేయని నిర్ణయించి
నవి. దీని కాండాంతగద్యలు నిట్టే చెప్పుచున్నవి.
గాయత్రీమంత్రములోని యిరువది నాలుగక్షరము
లొక్కొకటి యొక్కొక్క వేయిగ్రంథము మొద
లుగ క్రమముగానున్న దని గాయత్రీరామాయణము
నిరూపించినది. ఏటినిబట్టి రామాయణ మాఱుకాం
డములలోని గ్రంథమిరువది నాలుగువేలని ప్రసిద్ధి
వచ్చినది. కాని బాలకాండము నాల్గవసర్గలోని

యీశ్లోకము—"చతుర్వింశత్సహస్రాణి శ్లోకానాముక్తవానృషిః, తథాసర్గశతాన్ పఞ్చ షట్కాణ్డాని తథోత్తరమ్" కృత్వాపితన్మహాప్రాజ్ఞస్సభవిష్యంసహోత్తరమ్"

అని చెప్పిన దానినిబట్టి ౨౪ వేల శ్లోకములు, ౫ వందలసర్గలు, ఆఱుకాండములలోనివా, లేక యేడుకాండలలోనివా యని కొందఱికి సంశయము కలుగవచ్చునని నేను గణింపఁగా వచ్చిన మొత్తములివి—

1 షట్కాండసర్గలు ౫౩౪, అందలి శ్లోకములు సుమారు ౨౦౪౦౦, అధిక పాఠశ్లోకములు సుమారు ౫౦౦, ఉత్తరకాండసర్గలు ౧౧౧, శ్లోకములు సుమారు ౪౫౦౦, అధికపాఠసర్గలు ౧౩, శ్లోకములు సుమారు ౧౨౨౮.

చూచితిరా? ఎట్లుచూచినా, పూర్వోక్తశ్లోకమిచ్చిన మొత్తములకును పైమొత్తములకును సరిపడను. అందుచే శ్లోకమిచ్చిన లెక్కలాఱుకాండములనుద్దేశించినవే కాని, ఏడుకాండముల నాశ్రయించినవి కావనుట నిజము. అయితే, పైశ్లోకమునకును, అందలి సర్గశ్లోకసంఖ్యల భేదమునకును గతియేమి? ఇందు కూహయేగతి. ఈ లెక్కలుచూపినవారన్యులుగాని వాల్మీకికాఁడు. తరువాత నెవరో సర్గశ్లోకసంఖ్యలు గణించు నాఁటికిది పైలెక్కలకు సరిపడియుండును. పిదప మఱియొక కాలమునకు ౩౪ సర్గలు పెరుగుటయు నింకొకకాలమునకు సుమారు మూఁడువేల శ్లోకములు తఱుఁగుటయు సంభవించి యుండునని యూహింపవలసి యున్నది. ఇందుకు షట్కాండములలోని యధికపాఠము లొకనిదర్శనము. కావున నాఱుకాండములలోని తెలియని లుప్తభాగముల మాటయేమైనను, తెలియుచున్న యధికపాఠములు ప్రక్షిప్తములనుట స్పష్టము. మఱియుఁ గుండలీకృతములై ముద్రితపుస్తకములఁ గనవచ్చు శ్లోకములేకాక బాలకాండము మొదటి సర్గలోఁ గుండలీకృతములు కాని కొన్ని భాగములు కూడ నట్టివేయనియు, యుత్తరకాండమంతయుఁ గూడ వాల్మీకి కృతము కాదనియు విశ్వసింపవలసి యున్నది. ఇపుడీ మూఁడువిషయములు నిశ్చయింపనించుక యత్నింతము.

కైకేయి రామప్రవాసాది వృత్తాంతము చెప్పిన పిదప భరతుఁడు దుఃఖితుఁడై పలికిన మాటలతో సర్గయారంభమైనది. అట్లగుట సహజము సముచితమునై యుండఁగా ముద్రితపుస్తకములలోఁ బది శ్లోకము లెక్కువగాఁ జేరినవి. అవి కుండలీకృతములై తమప్రక్షిప్తత్వము వెల్లడించుచునే యున్నవి.

బాలకాండము మొదటిసర్గలో సకలసద్గుణపూర్ణుఁడగు మహావీరుఁడెవఁడన్న వాల్మీకి ప్రశ్నకు శ్రీరాముఁడట్టివాఁడని నారదుఁడు సమాధానమిచ్చుచు, దశరథుఁడు రాముని యువరాజును జేయనెంచుట మొదలుగా రావణవధానంతరము రాముఁడు వచ్చి రాజయ్యె నన్నంతవఱకుఁ గల రామచరితములోని విషయముల పట్టికయిచ్చి నట్లున్నది. రెండవ సర్గలో, క్రౌంచపక్షి కథాదులు వర్ణింపఁబడినవి. ఈరెండు సర్గలు రామాయణమునకుఁ బునాదులై సర్వవిధముల గ్రంథావతారికలై యొప్పుచున్నవి. మఱియు ద్వితీయసర్గాంతమందలి "రఘువరచరితం మునిప్రణీత" మిత్యాదిశ్లోకమునకుఁ బంచమసర్గారంభమందలి "సర్వాపూర్వమియంయేషా" మిత్యాది శ్లోకము చక్కఁగా నతుకుచున్నది. ఇట్లుండగా

మూఁడవసర్గయంతయు మరల భంగ్యంతరముగా విషయసూచికయై కథకడ్డమయినది. అట్లె షట్కాండశ్లోకసంఖ్యాదులతోడి నాల్గవసర్గయు సందర్భోచితముగాక కథ కడ్డమైనది. ఈరెంటియందును, ఉత్తరకాండను సందర్భము కలిగించు కొన్నిమాటలుండుట చూడఁగా, ఉత్తరకాండము వెలసిన పిదప

---

1 ఏప్రతినిబట్టి చూచినా, శ్లోకసంఖ్య ఒకటి రెండు వందల తేడాతో సరిపడును.

దానికనుకూలముగా నివి తరువాతఁజేరినవని తెలియుచున్నది. కావున నుత్తరకాండము మాటయొకింతచూతము.

ప్రాప్తరాజ్యస్య రామస్యేత్యాదిశ్లోకముతో నుత్తర కాండ మారంభమగును. అందు, ఋషులొనర్చు రామస్తుతితోను హనుమదాది వీరులవృత్తాంతములతోను ౪౦ సర్గలు గడచినవి. తరువాత సీతా విసర్జనకథా బీజమంకురించినది. దానికి ౧౨ సర్గలు పట్టినవి. అంత నృగనిమ్యాదుల కథలతోఁ గొన్ని సర్గలు గతించినవి. ఇట్లు ౫ సర్గలు వెళ్ళినతరువాత, కుశలవ జన్మవృత్తముదయించినది. తరువాత మరల నేవో కథలు. పిదప ౯౯ వ సర్గనుండి భవిష్యదుత్తరకథ. వీని నడుమ నధికప్రక్షిప్తసర్గలు. ఈ విధముగాఁ బూర్వ రామాయణకథావచనముతో నెట్టి పోలికయులేని డొంకతిరుగుడు రచనయు, అందలి కవిత్వమున కీడుగాని సాధారణకవితయు, అందలి మాధుర్యములో నావగింజంతైన లేని వర్ణనలును గలిగిన యుత్తరకాండము వాల్మీకి మహర్షి కృతము కాదని రెండును బఠించినవారికిఁ దెలియనిదికాదు. కాని, కొందఱు, చిరకాలముగా వచ్చు శ్రీరామప్రసిద్ధికి విరుద్ధముగాఁ జెప్ప జడియుచు నుత్తరకాండము వాల్మీకి కృతమే యని చెప్పటకలరు. కాని యది సరికాదు. కావున రామాయణ మహాభారతములు దేశమున బాగా వ్యాపించిన పిదప వానిం జదివిన యొకవిద్వాంసుఁడు భారతకథతోఁ గృష్ణద్వైపాయనునికిఁ గల్పింపఁబడిన సంబంధముచూచి, రామకథతో వాల్మీకికి సంబంధము కలిగించుటకై యుత్తరకాండకథ కల్పించియుండుననియు పూర్వ రామాయణము నుత్తరరామాయణమును జదివిన తరువాతి పండితుఁడొకడు, ఉత్తరకాండ కథాప్రసక్తి కలుగునట్లు బాలకాండమునఁ దృతీయచతుర్థసర్గలు కల్పించి చేర్చియుండుననియు నమ్మవచ్చును. ఈవిశ్వాసము నక్కఱలేని విషయసూచికతోడి తృతీయసర్గ తుదిశ్లోకములును, అసంగతముగా నున్న చతుర్థసర్గోపక్రమోపసంహారములును బలపఱచును గావున దీనినిగూర్చి యింతకంటె వ్రాయఁబనిలేదు. కాని కొందఱాంగ్లవిమర్శకులు తలంచినట్లు బాలకాండమంతయుఁ బ్రక్షిప్తమనుట మాత్రము శక్యముకాదు.

'కొన్ని సంశయాలకు' జవాబు

ప్రబుద్ధాంధ్ర ౫వ సంపుటం ౨వ సంచికలో నేను శ్రీ గుడిపాటి వెంకటచలంగారు ప్రకటించిన 'బిడ్డలశిక్షణ' పుస్తకం మీద విమర్శచేశాను. ఆవిమర్శలో శ్రీ వెంకటచలంగారి శైలినిగురించికూడా కొంత విమర్శించేను. ఈశైలి విమర్శకు కొడవటిగంటి కుటుంబరావుగారు ప్రతివిమర్శ రాశారు. అవసర మవడంచేత ఆ ప్రతివిమర్శకు చిన్నజవాబు రాస్తున్నాను.

(౧) వెంకటచలంగారి శైలిలో ఈకిందిమాటలు నేను ఆక్షేపించేను. పూర్ణారోగ్యం, విస్తీర్ణం, సంస్థ, నిర్ణయం, మాత్రుదేవతలు, రుషులు, అవస్థ, స్వక్రుతు దుఃఖాలు, స్తితి, అజీర్ణం మొదలైనవి. ఈమాటలలో వర్ణక్రమం పాటించకపోవడం తప్పన్నాను. పై మాటలలో కుటుంబరావుగారు ప్రత్యేకంగా భావతుకు తావతు ప్రయోగించడం గురించే తమ అభిప్రాయం చెప్పేరు. ఎందుచేతంటే వారు కూడా ఆమాటలు అలాగే రాస్తారుకాబట్టి. తక్కినవాటిని గురించి, ఎవరు ఎలా ఉచ్చరిస్తే అలా రాయవచ్చు అన్నారు. అలాగు అన్నారన్నమాటేగాని వారికైనా అలాగ రాయడం యెక్కువ యిష్టంకాదు.

వారి యీ కిందివాక్యాలు చూడండి. 'కట్టుబాట్లు వద్దనటానికీ వీల్లేదు; మనిషి కాక తెలుగై వూరు కుంటుంది......భాషకు అవసరమైన కట్టుబాట్లన్నీ చేసి, ప్రతిగాలికీ యెగిరిపోకుండ అవయవాలు స్వేచ్ఛగా కదిలించడానికి వీలులేకుండా వుండకుండా తగిన యేర్పాటుచేసి తెలుగుభాషను కూడా స్టాండర్డైజుచేసి పుణ్యం కట్టుకోవాలి' అని కుటుంబరావుగారు రాసేరు. మనం మాట్లాడేటట్లు మనం రాయలేము. కనుక మాట్లాడేటట్లు రాయడమన్నది అసాధ్యమైనపని. భాషకు అనవసరమైన మార్పులు చేసుకుంటే మనమే నష్టపోతాం. వెంకటచలంగారు చేసినమార్పులు అనవసరమని తలుస్తున్నాను.

(2) అచ్చుతో ప్రారంభించే టటువంటి మాటలు వాక్యాదిని వచ్చినప్పుడు అచ్చుగానే వుంటాయి. అవే వాక్యంమధ్యవస్తే ఆఅచ్చులే మరొకరూపం పొందవచ్చు. వాక్యాదినే శ్రీవెంకటచలంగారు 'యిష్టం, వురుము, యీమధ్య' మొదలైనవి ఉపయోగించేరు. ఇది తప్పు. నేను వాక్యంమధ్య 'వుండాలి' అని రాసేను. దాన్ని కుటుంబరావుగారు ఆక్షేపించేరు. వాక్యంమధ్య అన్ని అచ్చులే అయితే వుచ్చరించడం కష్టం. ఆయా సందర్భాలనుబట్టి మారుస్తాం.

(3) 'బిడ్డలశిక్షణ'లో కొన్ని ఇంగ్లీషుమాటలు అనవసరంగా వాడబడ్డాయి. వాటికి తెలుగు వుండనేవుంది. ప్రిన్సిపుల్సు అనేమాటకు నియమాలనీ, టెంపర్మెంట్సు అనేమాటకు తత్వమనీ అంటున్నాము. ఆయా సందర్భాలనుబట్టి పై రెండిటికీ మరికొన్ని మాటలుకూడా ఉపయోగించవచ్చు. కుటుంబరావుగారు రాసిన యీ చిన్నవిమర్శలో అనవసరంగా ఇంగ్లీషుముక్కలు, 'డిక్షనరీ, ఛాలెంజి, పబ్లిషు, ఇంగ్లీషులిటరేచరు' మొదలైనవి ఉపయోగించేరు. వీటి కన్నిటికీ తెలుగు వుండనేవుంది.

ఏకుమళ్ల కామేశ్వరరావు.

గ్రాంధికంబునుండి వ్యావహారికంలోకి

"ఈమధ్యనుండి మీరు సంపాదకీయంబులు గ్రామ్యంబున వ్రాయుచుండుటకుఁ గారణంబేమి?"

"ప్రబుద్ధాంధ్రలోని గిడుగు రామమూర్తిపంతులుగారి వ్యాసం మాలో, మార్పు కలిగించింది. అప్పటినుంచి సంపాదకీయాలు గ్రామ్యంలోనే వ్రాయాలని శపథం చేసికొన్నాం"

ప్రజామిత్ర (౧౫-౪-౩౪)

వ్యాఖ్యానములు

చచ్చినా సరేట

"నాట్యకళ సంసారులు అవలంబింపదగినది కాదని సిద్ధాంతీకరించిన యెడల అట్టి నాట్యకళనైనను నాశనము చేసి వేశ్యల నుద్ధరించుట పరమ కర్తవ్యము"

కళావంతుల తొమ్మిదో మహాసభని గురించిన సంపాదకీయంలో (౩౧-౩-౧౯౩౪) కృష్ణాపత్రిక అన్న మాట యిది.

కాలం మారిం దంటే వొప్పుకుంటాం. రుచులు మారా యన్నా సమ్మతిస్తాం. కులధర్మాలు మారిపోతున్నా యన్నా అంగీకరిస్తాం. చివరికి దృక్పథమే మారిపోయిం దంటే గూడా మాభాగే

అంటాం; కాని "కళ చచ్చినా సరే" అంటే మాత్రం "యేమిటీ?" అనవలసివస్తుంది.

ఐహికజీవితం యాతనాబంధురం; కాని సౌఖ్య భూయిష్ఠం కాదు. అయినా మానవులు "యింకా యింకా బతికివుండా" లని వుబలాటపడుతూవుండడం కళామాధుర్యానికి చొక్కి. కాని మరొకందువల్ల కాదు.

భగవంతుడి సృష్టి అంతా కళాభరితం అన్నంత మాత్రాన చాలదు. కళకోసమే సృష్టి.

మానవజీవితానికి కళే ప్రాణం. నాగరికతకి కళే నిగ్గు.

కళ లేదా, విజ్ఞానం లేదు. సభ్యత లేదు. జీవితం వ్యర్థం.

దారిద్ర్యం అంటే ఐహికజీవితంలో కళని అనుభవించడానికి అవకాశం లేకపోవడం. పాపం అంటే పరలోకంలో కళానుభవానికి వీల్కు లేకపోవడం.

సత్యం కళకి సంబంధించిన ధర్మసూత్రం! ధర్మం కళకి అతివ్యాప్తి, అవ్యాప్తి, మిథ్యావ్యాప్తి కలగనివ్వని కొలబద్ద. సభ్యత కళయొక్క సమ్యగ్విని యోగం.

కళ మానసికవ్యవస్థలకి అందేది కాదు. అది సూటిగా హృదయంమీద అంకితం అయేది. కాగా కళ అక్కరలేదంటే అక్కడ హృదయం లేదన్నమాట.

ప్రపంచకంలో అనేకజాతు లున్నాయి. అన్ని జాతులవారూ యీనాట్యకళని శిరసా వహిస్తున్నారు. నాట్యం లేని రోజు వారికి దుర్దినం.

పాశ్చాత్యదేశాలలో వొకడి పెళ్ళాన్ని యింకొకడు గట్టిగా కౌగిలించుకోడానికి కూడా సంఘధర్మా లంగీకరిస్తున్నాయి; గాని నాట్యకళని విడిచిపెట్టడానికి వొప్పుకోవడం లేదు.

ఇక్కడ వేశ్య లుండాలా అక్కరలేదా అని కాదు ప్రశ్న. నాట్యకళ మాట యేమిటి?

అయితే, నాట్యకళ సంసారస్త్రీలకి వుపాదేయం కాదేమో అని కృష్ణాపత్రికే సందేహిస్తోంది. మరి వేశ్యలు లేకపోతే యెలాగా?

పాశ్చాత్యదేశాలలో వేశ్యాకులం లేదు కనక మనదేశంలో కూడా వుండకూడదు. సరే. అయితే పాశ్చాత్యులు యీకళని సంసారుల్లోనే వ్యాపింపచేసుకున్నారే? మనం మాత్రం అలా యెందుకు చేసుకోగూడదూ?

వున్న దల్లా యేమిటంటే?

జర్జరిత మైపోయివున్న మన సంఘాన్ని దిద్దుకోడంలో నేడు చిత్రాకర్షకాలై వున్న పాశ్చాత్యసంఘాలను యెదట మాత్రమే వుంచుకునివుంటే మన కీచిక్కులు రాకపోవును. మన సంస్కర్తలకు అవి వరవళ్లయిపోయాయి. దానితో యిక్కడ అసాధ్యసమస్య లేర్పడ్డాయి.

"అబ్బే! వేశ్యాకులం యేమిటీ?" అని వారాక్షేపిస్తే మనవారు "ఛా, ఛా! దిద్దేసుకోవా" లనుకున్నారు; గాని యిది తెచ్చిపెట్టుకున్న వుద్దేశం కావడం వల్ల నాట్యకళాసమస్యని విడదీసుకోలేకపోతున్నారు.

ఇక వీరికి సులభంగా కనపడ్డ దల్లా నాట్యకళని చంపుకోడం. అయితే, తీరా దీన్ని సమూలంగా నాశనం చేసేసుకున్నాక అప్పుడు మళ్లీ పాశ్చాత్యులేమని ఆక్షేపిస్తారో?

ఏతావతా: మన దేశంలో వేశ్యాకులం వుండాలా అక్కరలేదా అంటే ఆవిషయంలో మా కేటూ పట్టుదల లేదు. వేశ్యలు పెళ్ళిళ్ళు చేసుకుంటే అది వారి యిష్టం. మా కేమీ ఆక్షేపణ లేదు.

ఈసందర్భంలో వారితో మా కేమీ ప్రసక్తి లేదు.

మే మడిగేది సంస్కర్తలను.

నాట్యకళకి దారి చూపించండి.

పోనీ, మనలో గూడా స్త్రీపురుష సంబంధాలు పాశ్చాత్యసంఘాలలో వున్నట్లు ఏర్పరుచుకుందామా?

బోధపడిందా ?

మొన్నటి ౨౧ వ తేదీని బరంపురంలో సమావేశమైన ఓఢ్ర యువజనుల రెండో సమావేశానికి ఎస్. సత్యమూర్తిగారు అధ్యక్షత వహించారు.

సత్యమూర్తిగారిని మాటలపోగుగా మాత్రమే మనం యిదివర కెరుగుదుం; కాని ఆయన యిప్పుడు పక్కా రాజనీతివిశారదు డని వెల్లడి అయింది.

ఆయన వెళ్ళింది ఓఢ్రయువజనుల సమావేశానికి అధ్యక్షత వహించడానికి. వెళ్ళి చేసింది ఓఢ్రులకు ఆంధ్రభూభాగాన్ని ఆక్రమించుకో మని సలహా. కటకం సమావేశపు తీర్మానాలకు తగ్గిపోవద్దని తీవ్రమైన ఉద్బోధనం.

శ్వేతపత్రంలో సూచించబడ్డ సరిహద్దులతో ఓఢ్రరాష్ట్రం లాభకరం కాదని, అందులో చేర్చని జయపురం, పర్లాకిమిడి పట్టణం, తత్సంస్థానం, మాళువాలు, మందసా, టెక్కలి, జలంత్రా, బుడారిసింగి, సింగుభూము, ఫుల్‌జార్ మొదలగు స్థలములన్నియు ఓఢ్రరాష్ట్రమున కలిపితీరవలె నని వారు తీర్మానం నెగ్గించారు. ఈతీర్మానం వారే ప్రతిపాదించారు కూడానూ.

౨౧ వ తేదీ ఆంధ్రపత్రిక లాగ పాపం సత్యమూర్తిగారు మన కనుకూలంగానే ఓఢ్రులకు నచ్చచెప్పారనుకోడం చాలా పొరపాటు. మూర్తిగారికి మన యెడల యెప్పుడూ కూడా సచ్చింత లేదు. వారి ఆంధ్రద్వేషం ఇదివర కనేకసందర్భాలలో వెల్లడి అయే వుంది.

ఆద్వేషానికి కారణమూ వుంది. ఆంధ్రమండలాలు ఎప్పటి దాకా ప్రత్యేకరాష్ట్రంగావిడిపోవో అప్పటిదాకా అరవదేశంలో ఎన్నో పెద్దపనులు సులభంగా చేయించుకోవచ్చు. విడిపోతే అరవదేశపు ఆదాయం తన ప్రభుత్వవ్యయాలకు కటాకటీగా సరిపోతుంది. ఎన్నదగిన పనులు యిప్పటిలాగ ఒక దాని తరవాత ఒకటి చేయించుకోడానికి వీలుండదు.

పైగా అటు ఉత్కళు లిప్పుడు ఒక విధంగా మనకి ప్రత్యర్థు లయి వున్నారు. ఇటు తమిళులు గూడా అందుకు పక్కవాంగు వేస్తే మన పని అడకత్తెరలోపడ్డ - వక్కగతిగా కిమ్మనకుండా చెయ్యవచ్చు. ఇదీ గాక, అక్కడ—ఉత్కళసీమ దగ్గర మనం తెల్లమొగం వేస్తే ఎప్పటి కేనా మనకి ఆంధ్రరాష్ట్రం వస్తే యెడల తమిళసీమ దగ్గర తాము నిర్లక్ష్యంగా మన న్నెదిరించవచ్చు. ఓఢ్రుల దురాక్రమణం అడ్డుకోలేని మనం తమిళుల ఆటంకాలు మాత్రం తప్పించుకోగలుగుతాము కనక నా?

తన ప్రత్యర్థికి అవతలి సరిహద్దులో వుండేవారితో స్నేహం చెయ్య మని రాజనీతిలో సామాన్యసూత్రం. సత్యమూర్తిగారు దీన్నిప్పుడు లెస్సగా అనుసరించారు.

ఓఢ్రయువకులు తమ సమావేశానికి సత్యమూర్తిగారిని అధ్యక్షులుగా ఆహ్వానించడంలో కూడా చాలా అర్థం వుంది. ఏమంటే! స్వరాజ్యపక్షంపేరితో కాంగ్రెస్సువారు మళ్ళీ శాసనసభలో ప్రవేశించబోతున్నారు. ఇదివరకే మదాసుశాసనసభలో ఆంధ్రరాష్ట్రప్రస్తావం రెండుమార్లు నెగ్గివుంది. ఇప్పుడు సత్యమూర్తిగారిని ఈవిధంగా కట్టుకుంటే వచ్చే యెన్నికలలో వారు యెలాగా నెగ్గుతారు గనక అప్పుడు వారి సాయంతో ఈతీర్మానాన్ని సులభంగా తిరగతోడెయ్యవచ్చు. లేదా వారి మంత్రాంగంతో జయపురం, పర్లాకిమిడి వగైరా ప్రదేశాలను సులభంగా ఓఢ్రరాష్ట్రంలో కలుపుకోవచ్చు.

నిజమే. మన కంటే ఇతర్లంతా రాజ్యతంత్రవిశారదులే. అరవవారిని సాంబారుమూర్తు లని ఎగతాళి చెయ్యడం తప్ప మన కేనీతీ తెలవదు. గుజరాతీల వెనకాలా, హిందూస్థానీల వెనకాలా బుర్ర వంచుకు వెళ్ళమంటే—అడిగారూ?

౩౮

"తమరు దయతో పంపిస్తూన్న 'ప్రబుద్ధాంధ్ర' తొలి మూడుసంచికలు అందుకున్నాను. కేవలగద్య రచనలకే తావివ్వడం సమంజసంగానూ, ఆంధ్రభాషాపురోభివృద్ధికారకంగానూ వున్నది. భాషాదేవికి కథలు గూర్చిన "పూలదండ" కంఠాభరణంగా యిచ్చినది మీరే మొట్టమొదట. మీ కలం మళ్ళీ ప్రబుద్ధాంధ్రలో కనిపించేసరికి పాతస్నేహితుణ్ణి చాలా కాలానికి చూచినట్లయింది. "ఆంధ్రమహాసభను మళ్ళీ నాలుగు పాదాల మీద నిలబెట్టే బాధ్యత "ప్రబుద్ధాంధ్ర"ది. ఆకార్యసాధనకు కావలసిన ఆరోగ్యము, ఆయుర్దాయము "ప్రబుద్ధాంధ్ర"కు కలగాలని ప్రార్థించాలి మనం"

కొల్లూరు ధర్మారావుకవి బి. ఏ.,
(ఆంధ్రగీర్వాణసాహిత్యపరిషత్తు)

౩౯

"జీవము కలిగిన భాషతో సునిశితమైన భావాన్ని ప్రకటించే ఆంధ్రవిలేఖక వర్గములో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు పెట్టింది పేరు. అటు గ్రాంథికభాషలోనూ, యిటు వ్యావహారిక భాషలోనూ శాస్త్రిగారి కలం మనోహరంగా నృత్యం చేస్తూ వుంది. సారస్వతసేవ చెయ్యాలనే సంకల్పంతో శాస్త్రిగారు పది సంవత్సరాలకు పూర్వము ప్రబుద్ధాంధ్ర అనే పక్షపత్రికను సాగించారు. సంస్కృతాంధ్రభాషలలో శక్తివంచన లేకుండా ఒక సంవత్సరము పని చేశారు. ప్రజాదరణం తక్కువగా ఉండడంచేత పత్రికను మాసపత్రిక చేసి కొంత కాలము నడిపారు. చందా తక్కువగా ఒక్క రూపాయి చేసి కొంత కాలము పని చేశారు. అనారోగ్యమువల్లనో, ప్రజాదరణ తక్కువచేతనో పత్రికను ఈమధ్య కొంతకాలము నిలిపివేశారు. "మీగడతరకలను భారతి" కందిస్తూ కొంతకాలము సారస్వతార్చన సాగించారు. తిరిగి జనవరినుండి పత్రికను శాస్త్రిగారు బయలుదేరదీశారు. పద్యవాఙ్మయాన్ని ప్రకటించక గద్యానికి మాత్రమే తావిచ్చి పత్రికను నడపటానికి శాస్త్రిగారు పూనుకున్నారు. శాస్త్రిగారి ఆంధ్రత్వాభిమానములో శతాంశమైనా ఆంధ్రులు కనపరిస్తే ప్రబుద్ధాంధ్ర ఆంధ్రులకు చేసే సేవ అద్వితీయమని ఘంటాపథంగా చెప్పవచ్చును"

పద్మశాలి. (ఫిబ్రవరి ౧౯౩౪)

౪౦

"ప్రబుద్ధాంధ్ర—మార్చిసంచిక. "తెలుగువారి దేశభాషాభిమానం" అను వ్యాసమును చదివితీరవలయును. నవీనఖండకావ్యములు శృంగారరసమునే ప్రధానముగా గ్రహించినవి. కావ్యమునకు భావమును రసమును ప్రధానము గాని క్రొత్త ఛందస్సు కాదు. గ్రాంథికభాష గద్య కుపయోగించినట్లు పద్యమున కుపయోగింపదేమో యను సందేహము గలుగుచున్నది. శ్రీశేషాద్రిరమణకవుల "గంగాధరుడు" అను మంత్రివర్యుని చరిత్రము చరిత్రజిజ్ఞాసువుల కత్యంతోపయోగము. ఆంధ్రుల చరిత్రమును కాకతీయుల చరిత్రము నామంత్రివర్యుని చరిత్రముతో కలిసియున్నవి. వ్యాఖ్యానాలలో చెప్పినట్లు రాయలసీమవారికి సర్కారుల ఆంధ్రులకూ వైమనస్యాలు జాతికి వేరుపురుగులు. ఇవి మన ప్రతిభకి కళంకం కలిగిస్తున్నాయి. సర్కారులవారూ రాయలసీమవారూ ఆంధ్రులైపోవాలి. వాస్తవమే. కాని "దీనికి సాధనం ఆంధ్రవిశ్వవిద్యాలయం కాదు, ఆంధ్రోద్యమం" అన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆంధ్రోద్యమానికి సాధన మని మా మనవి. వేదికలు వ్యాసకర్త లందరూ చదివి అందలి విషయములను గ్రహించవలయును"

సరస్వతి (౧ వ సంపుటం, ౨౩ వ సంచిక)

౪౧

"రాజమండ్రి కళాభివర్ధనీపరిషత్పక్షమున శ్రీయుత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి సంపాదకత్వమున వెలువడుచున్న ప్రబుద్ధాంధ్ర యను మాసపత్రిక మా కార్యాలయ మలంకరించినది. ఆంధ్రదేశమున విజ్ఞానమును పెంపొందించగల వచనవాఙ్మయమును సంస్కరించుట కీపత్రిక పాటుపడుచున్నది. ఇందు ప్రచురింపబడు వ్యాసము లన్నియు నాంధ్రమండలమున పేర్వడసిన మహాపండితవిరచితములై రసభరితములై మనోరంజకములై పాఠకులను మరల మరల పఠింపజేయుచున్నవి. సర్వజనసమాదరణీయ మగు నీపత్రిక ఆంధ్రదేశమున ప్రతి వ్యక్తియు తప్పక ఆదరింపదగియున్నది."

హిందూసుందరి (మార్చి ౧౯౩౪)

౪౨

"పత్రిక దినదినాభివృద్ధి చెందుగాక యని కోరుచున్నాను"

దంతుర్తి శాంతయ్య

౪౩

"పత్రిక సకాలమునకు వెలువడుచున్నందుకు సంతోషము. అంతయు భాషావిషయికవ్యాసములే యున్నవి. గ్రామపునర్నిర్మాణవిషయమును కూడ చేర్పింపవేడెదను"

నరసింహదేవర సత్యనారాయణ

౪౪

"తమ జాబు చేరింది. ప్రబుద్ధాంధ్రను మళ్ళీ ప్రారంభించా రని తెలుసుకోవడంవల్ల బ్రహ్మానందం పొందాను. శ్రీపాదవారి లేఖినిజలయంత్రం నుండి వెలువడే కథాధారల్లో ఆంధ్రదేశం మొదటి నుంచీ మునక లిడుతూనే వుంది. అయితే దురదృష్టంచేత అందుకు అంతరాయం కలిగింది. ఇప్పుడు మళ్లీ దైవికంగా తమ లేఖినియంత్రం పని సాగించడం మొదలెట్టింది. ఇది తెలుగుపెద్దలు చేసుకున్న పుణ్యవిశేషమే కాని యింకోటి కాదు. అనేక విధాల అనర్థదాయకంగా వుండే పద్యకవిత్వానికి మీ పత్రికలో తావియ్యకపోవడం మంచిదే. ఈ సాహసానికి—కాదు. ఈ పుణ్యకార్యానికి మీరు అభినందనీయులు"

బైరెడ్డి రంగారెడ్డి

స్వీకారము

౧౨ గోల్కొండపత్రిక రెండోసంవత్సరాదిసంచిక

ఇది మా కార్యస్థాన మలంకరించింది. పత్రికను ప్రకటించడంలో కంటే యీ సంచికను ప్రకటించడంలో సంపాదకుల శ్రద్ధ యెక్కువగా కనపడుతోంది. ఇంకా కొంచెం శ్రద్ధ చేస్తే యిది యింకా చాలా బాగుండి వుండును. ఇందులో ౨౬ విషయా లున్నాయి, వాటిలో ౯ పద్యవ్యాసాలు. వాటివిషయంలో సంపాదకులు మొగమాటపడినట్లు తోస్తుంది. అవి సంచిక విలవని తగ్గించాయి; గాని వున్నది వున్నట్టేనా వుంచలేదు... వచనవ్యాసాలలో ౧ బూర్గుల రామకృష్ణారావు బి. ఏ. ఎల్. ఎల్. బి. గారి నిజామురాష్ట్రరాజ్యాంగచరిత్ర ౨ వారిదే మన ప్రస్తుతరాజ్యాంగవిధానము, ౩ శ్రీమతి ఎల్లాప్రగడ సీతాకుమారి గారి స్త్రీలు—ఆర్థికస్వాతంత్ర్యము, ౪ ఎల్. శంకరనారాయణరావు ఎం. ఏ. ఎల్. ఎల్. బి. గారి లలితకళలు, ౫ సురవరము ప్రతాపరెడ్డిగారి టప్పాచరిత్ర, ౬ ఇ. రామచంద్రరావుగారి ప్రజారక్షణము ౭ శ్రీమతి లోకనంది సత్యవతీబాయిగారి ప్రస్తుత

విద్యావిధానము, ౭ వి. ఆర్. అవధానిగారి ౧౯వ శతాబ్దమునాటి కబుర్లు, ౮. ఇల్లిందల సీతారామారావు బి. ఏ. ఎం. ఎస్సిగారి నిజామురాష్ట్రము జనపరిగణననివేదిక, ౧౦ శ్రీమతి కనపర్తి వరలక్ష్మమ్మగారి భారతమహిళోద్యమము అమూల్యవ్యాసాలు. ఆదిరాజు వీరభద్రరావుగారి శ్రావణి అనేకథ కొత్త భావాలను రేపెడుతోంది; గాని ఆవేశం చాలదు. ముడుంబ వేంకటరాఘవాచార్యులు బి. ఏ. బి ఇడి గారి ఆధునికభావకవిత్వతత్వంలో ఎత్తుగడ బాగానే వుంది; గాని నిర్వహణం కుంటుపడిపోయింది. పైగా శైలిని గురించి ఆచార్యులుగారు తొందరపాటు కనపరిచారు...సంపాదకుల ప్రయాస సార్థకం అయింది. ఏమంటే ఈసంచికలో నిజామురాష్ట్రము చక్కగా ప్రతిఫలిస్తోంది. గొప్పవారి చిత్రపటములు సంచిక విలువ హెచ్చించాయి. సంచిక ౪౪ పేజీలదే అయినా ఆధునికవాఙ్మయానికి మంచి భూషణంగా వుందని మేము భావిస్తున్నాము. ఇది గోల్కొండపత్రిక చందాదారులకు ఉచితం. ఆంధ్రులందరూ గోల్కొండపత్రిక నాదరించి సంపాదకులకు ప్రోత్సాహము కలిగింపకోరుతున్నాము.

౧౩ భాగవతావతరణము :

నోరి నరసింహశాస్త్రిగారు రచయిత. సాహితీ సమితికి చెందినవారు.

సభాపతి శివశంకరశాస్త్రి ప్రోదిలో పెరిగిన వనవాటిలో నవ్యత వాసించినది. నిజమే. కాని అది పలువోకల వోయినది. ప్రతిభావంత మైన నవ్యత మనోజ్ఞమే యగును. కావ్యము రెండు విధములు: దృశ్యము, శ్రవ్యము. దృశ్యశక్తిక సంస్కృత సారస్వతమున మెరుగులు దిద్దుకొన్నది. బహుళముగా తెలుగున నాడునాటికి మెరుగుగా తరుగుగా చిందరవందర అయినది.

వాఙ్మయా నరసఖ్యమున ఒక విధముగా తెలుగు క్రొత్తదనమే నేర్చుకొన్నది. అయినా. పద్యనాటికలు తెనుగు కనులకు క్రొత్తవి. శివశంకరశాస్త్రిగారి పద్మావతీచరణ చారణచక్రవర్తి పద్యనాటిక. దీనికి ముందును వీరివి యిట్టివి కలవు బహుశః యిట్టి రచనకు వీరే ఆద్యు లేమో. శివశంకరుని పద్యనాటికలు తత్రాపి—చక్రవర్తి సుపరిణతము. పాత్రవిన్యాసములో వస్తుసంఘటనలో రూపకత్వము చిందులు ద్రొక్కినది.

నరసింహశాస్త్రిగారి భాగవతావతరణము గూడ పద్యనాటిక. భాగవతము అవతరించుట యిందలి వస్తువు. దీనికి రూప మిచ్చుటలో కావ్యత్వము కనిపింపదు. దృశ్యకావ్యము శ్రవ్యకావ్యముకంటె విశిష్టమయిన దను విషయము రూపక కర్తలు మరువరానిది. దీనికి ఫలితముగా ద్రష్టలకు కాక, పఠితలకు సుగమత్వము ప్రయత్నదానీయము. ఇందు కొంత వరకు శ్రవ్యకావ్యశక్తిక నడచినది. రూపకత్వము యెడనెడ లేతలేతగా గోచరించును. ప్రౌఢత్వ మున్నది. రచనాసౌష్టవ మున్నది. ఈ రెండును రూపకత్వమునో శ్రవ్యత్వమునో అధిగమించిన ప్రాప్యత కరబదరసమానము.

“నాటకాంతమ్ కవిత్వమ్” కా.

ఇందు “వైశంపుఁడు” వంటివి ప్రౌఢప్రయోగము లున్నవి. ఇవి సమూలము లయ్యో నేని సంతోషము.

‘హనుమచ్ఛాస్త్రి’